మునివరుడు

పండిత గురుదత్త విద్యార్థి



శ్రీ విద్యా బుక్‌డిపో సుల్తాన్ బజారు,

హైద్రాబాద్ వారియందు లభించు వైదిక సాహిత్య గ్రంథములు

1.	వైదిక సిద్ధాంత పరిచయము.	మాలె నాగభూషణము	15.00
2.	పెళ్లిముచ్చట్లు,వైదిక వివాహ సంస్కారము.	అన్నేకేశవార్యశాస్త్రి	3.00
3.	బ్రహ్మచర్యము.	భావజులకుమారస్వామి	1.00
4.	ముందడుగు.	భావజులకుమారస్వామి	1.50
5.	ఆర్యసమాజ నియంత్రణము.	భావజులకుమారస్వామి	1.50
6.	నాస్తికునితో నాల్గుమాటలు.	భావజులకుమారస్వామి	1.00
7.	విద్యార్థి మరియు-సదాచారము.	భావజులకుమారస్వామి	1.00
8.	దేవునకు మానవునకు గల అడ్డుగోడలు.	టి. సూర్యనారాయణ	1.00
9.	వేదోపదిష్ట మానవకర్తవ్యము.	పండితరాజరత్నమాచార్యులు	1.75
10.	తేనీరు (చాయ), భయంకర విషము	భభావజులకుమారస్వామి	1.00
11.	జీవిత సమస్యలకు సరియైన సమాధానము.	భావజులకుమారస్వామి	1.50
12..	బుద్ధివికసించుటెట్లు.	భావజులకుమారస్వామి	1.00
13.	సంక్షిప్తసత్యార్థప్రకాశము.	పం॥రాజరత్నమాచార్యులు	10.00
14.	ఒకే మార్గము.	మహాత్మ ఆనందస్వామి	15.00
15.	వైదిక సుఖజీవనము. లోకమలహరి	(మహాత్మ ఆనందస్వామి)	8.00
16.	ఈశ్వర రహస్యసారము.	ఆర్యనారాయణమూర్తి	23.00
17.	వేదములలో విజ్ఞానము.	పండిత రాజరత్నమాచార్చులు	3.00
18.	దార్శనిక విచారము-వేదము.	పండితరాజరత్నామాచార్చులు	2.00
19.	ద్రవిడ వేదభాష్యము.	పండితరాజరత్నమాచార్చులు	1.00
20.	సంధ్యోపాసన విధి.	పండితకేశవార్యశాస్త్రి	5.00
21.	సంధ్యోపాసనావిధి-హింది		5.00
22.	సత్యార్థప్రకాశము, 10 సముల్లాసములు	పండిత విశ్వామిత్రగారు	18.00
23.	నమస్తే.	లోకామల్లారిగారు	4.00
24.	వైదిక సామ్యవాదము.	లోకామల్లారిగారు	5.00
25.	వేదజ్ఞానము.	లోకామల్లారిగారు	3.00

ఓ౩మ్

సహృదయ వైదిక సాహిత్య ప్రచురణల గ్రంథమాల :- 14

మునివరుడు

పండిత గురుదత్త విద్యార్థి



రచన

హింది మూలము : పం॥ త్రిలోకచంద్

అనువాదము : లోకా లక్ష్మీనారాయణ (మనస్వీ)

ప్రకాశకులు : కోటికె లక్ష్మయ్యగారు

సహృదయ వైదిక సాహిత్య ప్రచురణలు

ఆర్యసమాజ మందిరము దిల్‌సుఖ్‌నగర్, భాగ్యనగరము-500060.

ప్రథమ ముద్రణ. మూల్యము : 6=00.

కూర్పు : యు ఎమ్ గ్రాఫిక్స్, నారాయణగూడ, భాగ్యనగరము . ఫో: 3222632

ఓ౩మ్

మునివరుడు పండిత గురుదత్త విద్యార్థీ

పంజాబు ప్రాంతంలో అనేక మహాపురుషులు జన్మించినారు. నేటి కాలంలోని మహాపురుషుడైన ఋషి దయానందుని గురువు విరజానంద దండి ఈ ప్రాంతంలో జన్మించిన వాడే. అట్లే మహర్షి దయానందుని అనుయాయులైన స్వామి శ్రద్ధానంద, పండిత లేఖరాం, మహాత్మా హంసరాజ్, లాలా లజపత్‌రాయ్ జన్మించిన గౌరవం ఈ ప్రాంతానికే దక్కినది. గురుకుల ప్రణాళికకు పోషకుడు ఆచార్య రాందేవ్ ఈ ప్రాంతంలోనే జన్మించినాడు. ఈ దృష్ట్యా పంజాబును ఆర్య సమాజపు కోట అనవచ్చును. అట్టి పంజాబు ప్రాంతంలోనే మరొక మహాపురుషుడు జన్మించి అల్పవయస్సులోనే అనల్పకీర్తి నార్జించి అస్తమించినాడు. అతడే మునివరుడు పండిత గురుదత్త విద్యార్థి. అతని గురించియే మన మిపుడు కొంత తెలిసికొన యత్నింతము.

జన్మము – వంశ పరిచయము :– గురుదత్త వైశాఖ శు॥ ౬/ ౧౯౨౧ వి॥ సం॥ ముల్తాన్‌లో జన్మించినాడు. ఆయన జన్మించినది పేరు పొందిన వీరసర్దానావంశం. ఆ వంశంలో రాజా జగదీశ్ వంటి రాజులు పుట్టినారు. రాజా జగదీశ్ విదేశీయుల బానిసత్వము నుండి తన ప్రజలను రక్షించుటకు తన సర్వస్వాన్ని చివరకు ప్రాణాలను కూడా అర్పించెను. ఈ వంశంలోనే లాలా రామకృష్ణ ఇంట గురుదత్త జన్మించెను. లాలా రామకృష్ణ ఫారసీభాషలో ప్రసిద్ధపండితుడు. ఆయన పంజాబు విద్యాశాఖలో అధ్యాపకుడు. ఆయనకు మంచి గౌరవముండెను. అతడు మహా బలవంతుడు కూడ. ఆయన బుద్ధి అతి సూక్ష్మము, తీవ్రము. స్మృతి శక్తి అద్భుతము. పండిత గురుదత్త తల్లి (నిరక్షరాస్య) చదువురానిది. కాని సంస్కారవతి, ధార్మిక ప్రవృత్తి గలది. ఉదార స్వభావము గలది. ఆమె బహుసంతానవతి. ఐనను సంతానాన్ని కోల్పోవుచు విపత్తికి గురియగుచుండెను. ఒకనాడు గురుదత్త తల్లి దండ్రులు వారి కులగురువును చేరిరి. తమ బాధను చెప్పుకొనిరి. గురువు వారిని సమాధాన

పరచెను. దైవ యోగం వల్ల అనతి కాలంలోనే వారికి పుత్రుడు జన్మించెను. వారు తమ ప్రార్థన ఫలించినదనుకొనిరి. ఆ బాలకునికి గురుదత్త (గురువుచే ఒసగబడినవాడు) అని పేరు పెట్టిరి. అతడే వారి చివరి సంతానం ఏకైక పుత్ర సంతానం.

గురుదత్తకు తమ వంశం నుండి, తల్లిదండ్రుల నుండి విశిష్ట గుణములు సంక్రమించెను. వీర సర్దానావంశానికి అనుగుణంగా ఆ బాలునిలో వీరభావాలు నెలకొని యుండెను. ధైర్యం, సంయమం, తల్లి నుండి లభించెను. ఉత్తమమైన శరీరబలం, తీవ్రబుద్ధి, దృఢమైన స్మృతి శక్తి తండ్రి నుండి సంక్రమించెను. అతనికి ఈ శారీరక, మానసిక సుగుణాలు చిన్ననాటి నుండియే ప్రకటమగుచుండెను. అతడు ఏడాదివయసులోనే పరుగెత్త సాగెను. కొంత కాలం గడచినంతనే సామాన్య వస్తువుల గురించి విచిత్రములైన ప్రశ్నలడుగుచుండెడివాడు.

విద్య :- గురుదత్తుని తండ్రి విద్యా విభాగంలో ఉపాధ్యాయుడు. కావున ఆయన తన కుమారుని చదివించుటలో అధిక సఫలుడయ్యెను. ఆయన కొడుకును చాల తక్కువగా మందలించెడివాడు. పాఠం జ్ఞాపకం చేయునట్లు ఏదోనొక లాభం చూపి ప్రోత్సహించేవాడు. బాలుడైన గురుదత్త తన సత్ప్రవృత్తి ననుసరించి నడచుకొనుచుండెడివాడు. ఎటువంటి ఆటంకం కలిగించెడివాడు కాడు. పైగా జాగ్రత్తగా అతని ప్రవృత్తిని, కోరికలను తెలిసికొన యత్నించెడివాడు. దాదాపు ఐదేండ్ల వయసులో గురుదత్తకు వర్ణమాల నేర్పించబడెను. ఆపై సంవత్సరం గణితంలో ప్రాథమిక అంశములు బోధింపబడెను. గురుదత్త చెప్పినదెల్ల వెంటనే గ్రహించెడివాడు.

గురుదత్తుని తండ్రి అతనికి ఎంతో మనోహరమైన పద్ధతిలో చదువు నేర్పెడివాడు. అతనిని తనతో (పరిసర) చుట్టు ప్రక్కలగల గ్రామాలకు తీసుకపోయెడివాడు. దారిలో ఇష్టము వచ్చిన ప్రశ్నల నడుగనిచ్చెడివాడు. ఆ ప్రశ్నలకు నేర్పుతో సమాధాన మిచ్చెడివాడు. దానివలన గురుదత్తుని జిజ్ఞాసాప్రవృత్తి పెంపొందుచుండెడిది. తండ్రి అతనికి ఇంటి వద్దనే ఉర్దూ, ఫారసీ భాషల చక్కని

పరిజ్ఞానం కలిగించెను. ఆ పిదప అతనికి ఆంగ్లం చదివించదలచెను. ఆయన ఆంగ్లం అభ్యసించకుండెను. తాను చదివించే రీతిలో గురుదత్త త్వొందరగా నేర్వగలడని నమ్మక ముండెను. అందువల్ల ఆయన స్వయముగా ఆంగ్లము మొదటి పుస్తకం చదివి తన కొడుకుకు నేర్పెను.

పాఠశాలలో చేరుట :- గురుదత్తుని తండ్రి ఝంగ్‌లో ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడు. కావున తన పాఠశాలలోనే గురుదత్తుని చేర్పించెను. గురుదత్తుని వయస్సు అప్పుడు ఎనిమిదేండ్లు. గురుదత్త ఆంగ్లంలో ఇతర సహాధ్యాయులకు తీసిపోకుండెను. ఏలన ఆంగ్ల భాష పరిచయం లేనందున ఆయన తండ్రి అతనికి నేర్పలేకుండెను. కాని ఉర్దూ, ఫారసీ, గణితం మున్నగు విషయాలలో గురుదత్త మిగతా విద్యార్థులకంటె ఎంతో ముందుండెను. ఆయన తన పాఠశాలా జీవితంలోనే ''మౌలానా రూమీ'' శమ్స్ తంబరేజ్ ''దీవానె హాఫిజ్' వంటి అనేక ఫారసీ గ్రంథాలను చదివెను. తల్లి ధార్మికస్వభావం గలదగుట వల్ల అతనిలో మొదటి నుండియే వైరాగ్యభావం ఏర్పడెను. ఈ ఫారసీ భాషా గ్రంథాల అధ్యయనం ఈతనిలో మరింత తన్మయతను కలిగించెను.

అద్భుత ప్రతిభ - కవితా శక్తి :- బాల్యం లోనే గురుదత్త గంటలకొలది ఆకాశము వైపు చూచుచుండెడివాడు. సర్వశక్తిమంతుడైన ఈశ్వరుని అద్భుత సృష్టి గురించి ఆలోచించెడివాడు. అతడు గొప్ప ఈశ్వర భక్తుడు. కొడుకు ఇట్లు గంటల తరబడి ఆకాశము వైపు చూచుచుండుట తల్లికి వింతగా నుండెను. ఆమె కొడుకును అందుకు మందలించెను. గురుదత్త ''తల్లీ నేను ఆకాశమందలి అద్భుత కాంతి పుంజముల చూచి ఆ విచిత్ర వస్తువుల నిర్మించెడివాడు తప్పక ఒకడుండ వలెనని భావించుచున్నాను. నీవు కూడా అటు చూడు. నావలెనే వాటిని నిర్మించిన వానిని వెదకుము'' అనెడివాడు. ఈ జిజ్ఞాసా ప్రవృత్తియే అతనినొక మహాపురుషుని చేయగలదని ఆ అమాయక తల్లికి తెలియదు. ఆమె ఆ ప్రక్రియను సమయం వృథా చేయుటగానే భావించెడిది.

సామాన్యంగా బాలలు కవిత్వం వ్రాయుటలో చాలా ఆనందాన్ని పొందుతారు. కాని ఆ కవిత్వం నియమబద్ధంగా ఉండదు. గురుదత్తుని కవిత్వం

నియమబద్ధంగా ఉండెడిది. ఇది ఆయన విశిష్టత. ఆయన గద్యాన్ని వెంటనే పద్యంగా మార్చగలిగెడి వాడు. ఆయన అంత తీవ్ర కవిత్వరచనా శక్తి గల వాడు. ఒకనాడు ఆయన ఒక పెద్ద ఉర్దూ వాక్యాన్ని వెంటనే పారసీ భాషలో కవిత్వంలోనికి మార్చెను. ఇంతైనను ఆయన జీవితం కవి జీవితంగా మారలేదు. పరిస్థితులు ఆయనను వేరే విధంగా మార్చెను.

ఉన్నత విద్య - స్వాధ్యాయశీలము :- మాధ్యమిక విద్య తర్వాత గురుదత్త తన జన్మభూమి ముల్తాన్ చేరి ఒక ఉన్నత పాఠశాలలో ప్రవేశించెను. ఆ పాఠశాల అధ్యాపక వర్గం ఇతని యోగ్యతను గాంచి ప్రభావిత మయ్యెను.

సామాన్యంగా పరీక్షలో ఉత్తీర్ణు లగుటయే విద్యార్థుల లక్ష్యం. వారు ఏదో విధంగా పాఠ్యగ్రంథాలను వల్లించి పరీక్షలో ఉత్తీర్ణు లగుదురు. కాని మన చరిత్ర నాయకునికి ఇట్టి సామాన్య అధ్యయనం వల్ల తృప్తి కలుగలేదు. మొదట అతడు పాఠశాల గ్రంథాలయాన్ని ఆసాంతం చదివెను. ఆ పిదప ముల్తాన్‌లోని ఇతర గ్రంథాలయాలలోని పుస్తకాలన్నిటిని చదివెను. అతడు పుస్తకాలను కాదు పుస్తకాలయాలనే చదివెడివాడన్న అతిశయోక్తి కాజాలదు.

మానసిక ఏకాగ్రత :- గురుదత్తుని పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు ఇతని స్వాధ్యాయ ప్రవృత్తిని ధర్మముపైపు త్రిప్పదలచెను. ఆయన కొన్ని హిందూ మత (ధర్మ) గ్రంథాలను గురుదత్త కిచ్చెను. గురుదత్త వాటి వలన మిక్కిలి ప్రభావితుడయ్యెను. ఈశ్వరుని విశేషమైన '' అన్హద్'' ను జపించసాగెను. కొంత కాలము దానిని కొనసాగించెను. ఆ తర్వాత ప్రాణాయామాభ్యాసం వల్ల మానసిక శక్తిని పెంపొందించుకోవచ్చు నని తెలిసికొనెను. పట్టుదలగా ప్రాణాయామము నభ్యసింపసాగెను. అతని బుద్ధి తీవ్రము, కాన సులభంగానే ఏకాగ్రతను సాధించెను. ఆతడు తన మనస్సును ఒక విషయంపై లీన మొనర్చినప్పుడు ఆతని చుట్టు ప్రక్కలో ఏమున్నది, ఏమి జరుగుచున్నది గూడా అతనికి తెలియకుండెను. అందువల్ల ఏ విషయాన్నైనా సూక్ష్మంగా అర్థం చేసికొనుట అతనికి చాల తేలిక అయ్యెను.

కాని క్రమక్రమంగా ఆంగ్ల శిక్షా ప్రభావం అతనిని ఆంగ్ల విద్వాంసుల రచనలవైపు ఆకర్షించెను. ఇంకేమి? ఆయన గొప్ప గొప్ప ఆంగ్ల విద్వాంసుల గ్రంథాలన్నింటిని చదివివేసెను.

క్రైస్తవ ప్రభావము:– ఆంగ్లేయుల గ్రంథాల పఠనప్రభావం వల్ల గురుదత్తునికి ఈశ్వరుని పట్ల పూర్వం గల విశ్వాసం సడలిపోయెను. ఆ కాలంలో యూరోపు అమెరికాల నుండి వచ్చిన క్రైస్తవులు మొత్తం భారతదేశాన్ని క్రైస్తవమయం చేయుటకు ఉవ్విళ్లూరుచుండిరి. పాశ్చాత్యవిద్యా పభావము ఒక వైపు భారతీయుల నమ్మకంపైన గొడ్డలిపెట్టుగా ఉండెను. పంజాబులో పాశ్చాత్య రీతినీతులే రాజ్యమేలుచుండెను. అట్టి స్థితిలో గురుదత్త మాత్ర మెట్లు దీనిని తప్పుకోగలడు? ఈశ్వర భక్తునికి పుట్టిన గురుదత్తుడే ఈశ్వరుని ఉనికిని సందేహించసాగెను. అతడు చదివిన ఫారసీ, హిందూ మత సంబంధ గ్రంథముల ప్రభావం ఒక్కసారే మాయమయ్యెను. పంజాబులో జనులు ఉత్సాహంతో, క్రైస్తవులు కాదొడగిరి. ప్రపంచాన్ని మిరుమిట్లు గొల్పు ఋషి మునుల ఆధ్యాత్మిక నిధు(సంపద)లు భారతీయుల దృష్టినుండి మరుగగుచుండెను.

భారతదేశంలో రాజ్యం తమదే కావున త్వరలోనే భారతదేశం మొత్తం క్రైస్తవమయం కాగలదని క్రైస్తవ ఫాదరీలు అనుకొనుచుండిరి. ఒక మహాపురుషుడు త్వరలోనే వారి ఈ ప్రయత్నమును వమ్ము చేసి ఆదిసభ్యత ఐన వైదిక సభ్యత్వం ను కాపాడగలడని వారికేమి తెలియును? దైవ కృపవలన భారతదేశమందలి కాఠ్యావాడ ప్రాతంలో ఒక అద్భుత పండితుడు జన్మించెను. ఆయన వేదాల సత్యజ్ఞానాన్ని సంపాదించి సమస్త మతములను సంస్కరించే భారం తనపై వేసికొనెను. వేదజ్ఞానం, వేదోపదేశం అన్నిటికన్న ఉత్తమమైనదని ఆయన జనులకు తెలిపెను. అతని బోధనా పద్ధతి, తార్కికశైలి జనులను ప్రభావితుల జేసితీరెడిది. సంకుచిత భావాలుగలవారు ఈ మహాపురుషుని అర్థము చేసికొనలేదు. వారు ఆయనను విరోధింప సమకట్టిరి. కాని తేజఃపుంజమైన సూర్యుని ఎవ్వరును అడ్డుకోలేరని ఆ అమాయకులకు తెలియకుండెను. పాఠకులు ఆ మహాపురుషుడెవరో తెలిసికొను కుతూహలం కలవారై ఉందురు.

ప్రాతఃస్మరణీయుడైన ఆ మహాపురుషుడే 'స్వామి దయానంద సరస్వతి' ఆయన క్రైస్తవమతస్థులను రంగంలోకి దిగి తమ మతము సత్యమైనదని నిరూపించుకొనవలసినదిగా పిలుపు నిచ్చెను. క్రైస్తవులు ఆయనను ఒక సామాన్య వ్యక్తి అనుకొనిరి. తమ పక్షాన్ని నిరూపించుకొనుటకు ముందుకు వచ్చిరి. కాని ఋషిదయానందుని యుక్తుల ముందు వారి ఆటలేమీ సాగలేదు. వారు అపజయం పాలై వెనుదిరిగిరి. సమస్త భారతవాసులను క్రైస్తవులుగా మార్చ వలెననుకొన్న క్రైస్తవఫాదరీలకు ఇంత వరకు పొందిన విజయం ఓటమిగా పరిణమించునేమో యను భయం కలిగెను. క్రైస్తవుల వైపు పరుగులిడుచున్న హిందూసమూహప్రవాహం అకస్మాత్తుగా నిలిచిపోయెను. ఇప్పుడది ఆర్యసమాజం వైపు ప్రవహింపసాగెను.

ఆర్యసమాజంలో ప్రవేశం:- ఆర్యసమాజంవైపు పరుగిడు హిందూ సమూహంలో గురుదత్త గూడా ఉండెను. గురుదత్తను ఆర్య సామాజికునిగా మార్చి ఆర్యసమాజం ఘనవిజయాన్ని సాధించెను. ఏలన తన వైఖరిని మార్చుకొనే ముందు గురుదత్తచాల జాగ్రత్తగా ఆలోచించేవాడు. ఆయన మొదట సత్యార్థప్రకాశం చదివెను. చదివి ౨౦ జూన్, ౧౮౮౦లో ఆర్యసమాజంలో సభ్యునిగా చేరెను. పండిత రమల్‌దాస్, లాలా చేతనానంద్ ఆయనకు పరమ మిత్రులైరి. వారితో ఆయన వేదం, ఈశ్వరుడు మరియు ఇతర విషయాల గూర్చి చర్చించేవాడు. త్వరలోనే ఆయన అష్టాధ్యాయీ చదువ మొదలిడెను. ఆర్యసమాజ అధికారుల సహాయంతో ఆయన పండిత అక్షయానందను (వ్యాకరణ) గురువుగా చేసికొనెను. కాని ఆయన గురుదత్తుని తృప్తి పరచలేకపోయెను. అందువల్ల ఒకటిన్నర అధ్యాయం వరకు చదివి గురుదత్తు ఆయన నుండి చదువుట నిలిపివేసెను. ఆ పిదప స్వామి దయానందుడు రచించిన 'వేదాంగ ప్రకాశ్(వ్యాకరణ గ్రంథం) సహాయంతో ఆయన అష్టధ్యాయి పైన ఎంతో అధికారం సంపాదించగలిగెను. ముల్తాన్‌లో ఆయనకు డాక్టర్‌వెలంటాయిన్ రచించిన '' ఈజీ లెసన్స్ ఇన్ సంస్కృత గ్రామర్' (సంస్కృతవ్యాకరణ సులభపాఠాలు) అను పుస్తకం లభించెను. దాని సహాయంతో స్వయంకృషి ద్వారా సంస్కృతం నేర్చుకోవచ్చును. గురుదత్తు

దానిని చదివెను. ఆ పిదప ఋషి దయానంద విరచిత "ఋగ్వేదాది భాష్యభూమిక"ను చదివెను. దానిని చదివి ఆతడు మిక్కిలి ప్రభావితుడయ్యెను. వయస్సు మీరిన కారణాన సంస్కృతం నేర్వలేని వారిని గూడా 'ఋగ్వేదాది భాష్యభూమిక'ను తప్పక చదువ వలసినదిగా ఆయన ప్రేరేపించుచుండెను.

గురుదత్తునిలో మొదటినుండియే ఒక విధమైన ఆకర్షణ శక్తియుండెను. ఒకసారి అతనిని కలిసికొన్న వ్యక్తి మరల మరల అతనిని కలిసికొన గోరుచుండెడివాడు. గురుదత్తు ఆర్య సమాజ సత్సంగాలలో నియమ పూర్వకంగా పాల్గొనుచుండెడివాడు. ఆర్య సదస్యులందరు ఆయన నెంతో గౌరవించెడివారు. అతని ఉన్నతిలో శ్రద్ధను కనబరచెడివారు.

లాలా గురుదత్త పండిత గురుదత్తగా మారుట :- గురుదత్త ఆర్యసమాజంలో చేరినప్పుడు ఆర్య సమాజం అంతగా ఉన్నతిని సాధించకుండెను. సమాజ సభ్యులు తమ ఆచారాలను, పరంపరలను మార్చుకొన సాహసింపకుండిరి. ఈ మార్పుగూడ గురుదత్తునితో ఆరంభమయ్యెను. ధార్మిక సంస్కృత సాహిత్యం పట్ల అతనికి గల ఆసక్తిని, అభిరుచిని చూచి జనులు ఆయనను లాలా గురుదత్త అనక పండిత గురుదత్త అని సంబోధింపసాగిరి. కాని దాని వలన గురుదత్త గర్వపడలేదు. నమ్రతతో తనను గురుదత్త విద్యార్థి యనియే సదా పేర్కొనెడివాడు.

అద్భుత ప్రతిభ :- విలక్షణ బుద్ధిగలవానిని జనులు ప్రతిభాశాలి అందురు. గురుదత్త మిక్కిలి ప్రతిభావంతుడు. అతడడిగిన ప్రశ్నలకు అతని ఉపాధ్యాయులు గూడా సమాధాన మొసగలేక తికమక పడుచుండిరి. అధ్యాపక వర్గం, పర్యవేక్షకాధికారులు ఆతని ప్రతిభను చూచి ఆశ్చర్య చకితులయ్యెడి వారు. అతని కన్న పై తరగతిలో చదివే విద్యార్థులుగూడా అతని వద్దకు పాఠములు నేర్చుకొనుటకు వెళ్ళుచుండిరి. ఇంతటి ప్రతిభగల వాడైనను అతనికి అభిమానం లేశమాత్రమైనను స్పర్శింపకుండెను. ఆతని సౌశీల్యమును గాంచి జనులు అతనిని వైరాగీ, గురూజీ అని పిలుచుచుండిరి.

యోగప్రేమ - సాధుసేవ :- మొదటినుండి గురుదత్త

ధార్మికత వైపు మొగ్గుచూపుచుండెను. అతడు ఎనిమిదవ తరగతిలో నుండగా యోగం వైపు ఆకర్షతుడాయెను. యోగం గురించి ఏ మాత్రమైనను తెలియునని ప్రతి సాధువును శ్రద్ధతో సేవించెడివాడు. గురుదత్త బాల్యం నుండియే ప్రాణాయామాభాస్యం చేయుచుండెడివాడు. అతని సాధుసేవ, వైరాగ్య ప్రవృత్తి మున్నగు చేష్టలను గమనించి అతని తల్లి తన కొడుకు త్వరలోనే ఇల్లు వదలి సాధువు కాగలడేమో అని భయపడెను. ఒకనాడు గురుదత్త ప్రాణాయామం చేస్తూ ముక్కునదిమి పట్టుకొని ఉండెను. తల్లి అతనిని చూచి మిక్కిలి కోపగించెను. కొడుకు యోగ మార్గాన్ని అనుసరింపకుండా ఆమె ఎంతయో ప్రయత్నించెను. కాని విజయం సాధించలేకపోయెను. జలప్రవాహాన్ని, హృదయ ప్రవాహాన్ని ఆపుట ఎవరి శక్యము?

ప్రవేశ (ఎన్ట్రెన్స్) కొరకు సిద్దపడవలసిన సమయంలో విద్యార్థు లందరు తమ తమ అధ్యయనంలో దృఢంగా లీనమయ్యేవారు. కాని మన 'విద్యార్థీజీ' ప్రతి చర్య విలక్షణంగా ఉండెడిది. ఆ సమయంలో ఆయనకు వేదం చదువవలెను అను కోరిక కలిగెను. అంతకుపూర్వమే ఆయన ఆంగ్ల సాహిత్యంలో మిల్టన్, కూపర్, శేక్స్ఫియర్‌ల గ్రంథాలు చదివి యుండెను. ఫారసీలో మస్నవీ, మౌలానా రూమీ, హాఫిజ్‌ల ప్రసిద్ధ రచనలను చదివియుండెను. అరబీలోని 'సర్ఫ్ నహవ్' మరియు 'మరా నహవ్' చదివియుండెను. భౌతిక విజ్ఞానం అతనికి ఆనందదాయకమైన విషయం. తర్కశాస్త్రం, మనోవిజ్ఞానం, తత్త్వ జ్ఞానానికి సంబంధించిన అనేక గ్రంథాలను పరిశీలనా దృష్టితో చదివెను. అప్పుడతని వయస్సు దాదాపు ౧౫ సంవత్సరాలు. ఎంట్రెన్స్‌లో నున్న బాలుర యోగ్యత సామాన్యమే. కాని మన గురుదత్తుని యోగ్యత గొప్పగొప్ప ఉపాధ్యాయులకన్న మిన్నగా నుండెను. గురుదత్త చదివిన గ్రంథాల పేర్లను గూడా మెట్రిక్ చదివిన విద్యార్థులు వినలేదు.

ఎంట్రెన్స్ చదివే సమయంలో గురుదత్త ఎఫ్. ఎ. విద్యార్థులతో చక్కగా పోటీ చేయగలిగెడివాడు. ప్రతి విషయాన్ని ఆయన చక్కగా అర్థం చేసుకొనేవాడు. ఆయన ఎన్నడును ఏ విషయాన్ని గూడా వల్లించలేదు. షేక్స్ఫియర్

నాటకాలను నిజంగా నటిస్తున్నట్లుగానే చక్కగా ఉచ్చరించేవాడు. స్వరం, చేష్ట, లయ - అన్నియు సందర్భానుసారంగా ఉండెడివి.

సత్యప్రియ, సదాచార జీవనం :- గురుదత్తునకు సత్యము పట్ల మిక్కిలి భక్తి. ఆయన ఎన్నడును అసత్యము పలికెడివాడు కాడు. ఆయన నడవడి చక్కనిది అందువల్ల ఆయన ఎవరికిని భయపడెడివాడు కాడు. పాశ్చాత్యప్రభావం వల్ల కళాశాల విద్యార్థుల నడవడి సామాన్యంగా చెడిపోవును. ఎంతయో ప్రయత్నించిన గాని కొంత మందియే పవిత్రాచరణగలవా రగుదురు. కళాశాలవిలాసజీవితం ఏ కొంతైనా తప్పక ప్రభావం చూపును. గురుదత్త మొదటి నుండియే తనను అదుపులో ఉంచుకొనుటకు అభ్యాసం చేసియుండెను. తన మంచి అలవాట్లను అతడు దృఢచిత్తంతో కాపాడు కొనెను. ఈ కారణం వల్లనే అతని జీవితం ఎంతో ప్రశంసనీయమై ఉండెను. పాఠ్యగ్రంథాలను వదలి అన్య ధార్మిక, వైజ్ఞానిక పుస్తకాల నెన్నింటినో చదివెడివాడు. అట్లయ్యును ఆయన మెట్రిక్ పరీక్షలో పంజాబు ప్రాంతమంతటిలో ఐదవ స్థానాన్ని సంపాదించెను.

కళాశాల జీవనము :- గురుదత్త జనవరి ౧౮౮౧ లో ఉన్నత చదువు కొరకు లాహోరు వెళ్లెను. అచట కళాశాలలో చేరెను. ఆనాడు పంజాబు అంతటికి అదొకటే కళాశాల. సమస్త జిల్లాల విద్యార్థులు చదువుటకు అందులోనే చేరెడివారు. ఆ కళాశాల ప్రధానాచార్యుడైన లైట్నర్ మంచి విద్వాంసుడు. సహృదయుడు. ఆయన ప్రాచ్య విద్యలలో గూడ విద్వాంసుడు. ఆయన పర్యవేక్షణలోనే ప్రొఫెసర్లు చక్కగా చదువు చెప్పెడివారు. ఆనాడు ఈ నాటి వలె ఉపేక్షాభావం లేకుండెను. అధ్యాపకులు తమ బాధ్యతలను బాగుగా గుర్తించెడి వారు. విద్యార్థులు గూడ ఉపాధ్యాయులను ఎంతో గౌరవించెడివారు. అగౌరవపరచే ప్రసక్తియే లేకుండెను. అందువలననే ఆనాడు ఎంతో యోగ్యతగల వ్యక్తులు సిద్ధమగుచుండిరి. గురుదత్త ప్రతిభాశాలి. అచటి వాతావరణం అతనిలో అసాధారణయోగ్యతను కలిగించెను.

కళాశాలలో ప్రవేశించి గురుదత్త 'మిల్ ' 'బేన్' ల గ్రంథాలను ఆసక్తితో పఠించెను. క్రమంగా ఆయన తత్త్వవేత్త లందరి రచనలను చదివివేసెను. ఆయన

ఏ దార్శనికుని గురించియైనను, ఏ విషయాన్నైనను వెంటనే చెప్పగలిగెడివాడు. ఏ దార్శనికుని గురించియైనను అతడు తెలుపలేనిదేదియును లేకుండెను. ఇది మిక్కిలి ఆశ్చర్యకరమైన విషయం కాదా? ఏలన అప్పుడే కళాశాలలో ప్రవేశించి చదువనారంభించిన ఒక బాలుడు ఇంతజ్ఞానం కలవాడుగా నుండు టెంతటి ఆశ్చర్యకర విషయం! ఒక తత్త్వజ్ఞానమే ఏమిటి గణితం, విజ్ఞానం, అరబీవ్యాకరణం వంటి ఇతర విషయాలలోను ఆయన అసాధారణ పండితుడే. పాఠ్యేతర పుస్తకాల నన్నిటిని చదువుచునే ౧౮౮౩ లో ఎఫ్. ఏ. పరీక్షలో ఆయన విశ్వవిద్యాలయంలో సర్వప్రథముడుగా నెగ్గెను.

ఈ మధ్యకాలంలోనే గురుదత్త '' ఫ్రీ డిబేటింగ్ క్లబ్ '' అను నొక సంస్థను నెలకొల్పెను. అందు వివిధ ధార్మిక విషయాలపైననే గాక ఇతర విషయాలపైనను వాదోపవాదములు జరుగుచుండెను. గురుదత్త తర్కశక్తి అద్భుతము. ఆయన ప్రతి విషయాన్ని ఇష్టమున్న రీతిలో త్రిప్పగలిగెడివాడు. తన విరోధము యువకులపై విపరీత ప్రభావము కలుగజేయుట గమనించి ఆయన ఆర్యసిద్ధాంతాలను సమర్ధించసాగెను. దాని ప్రభావం వల్ల నవయువకులు ఆర్యసిద్ధాంతభక్తులైరి.

సంపాదకత్వము :– గురుదత్త యుక్తులు ప్రబలమైనవి. జనులు అతని యోగ్యతను అంగీకరించెడివారు. ఒక సజ్జనుడు అతని ప్రతిభవల్ల మిక్కిలి ప్రభావితుడయ్యెను. గురుదత్తుని, అతని ఇద్దరు మిత్రులను ఒక పత్రిక నడుపుటకు ప్రోత్సహించెను. తత్పరిణామముగ ఆంగ్లంలో '' Regenerator of Aryavart '' (ఆర్యావర్త పునరుద్ధారక) అనుపేర గురుదత్త సంపాదకత్వమున ఒక పత్రిక వెలువడెను.

మిత్రులపైనను, సహాధ్యాయుల పైనను గురుదత్తుని ప్రభావం ఉత్తమముగా నుండెను. ఇతర సహచరులలోను ఎంతో పరివర్తన కలిగెను. ఆయన మిత్రులు పలువురు పంజాబు సామాజిక జీవనంలో శాశ్వతమైన పేరును సంపాదించిరి. వారిలో మహాత్మా హంసరాజ్, లాలాలజపత్‌రాయ్ ముఖ్యులు, పేర్కొనదగినవారు.

నాస్తికత్వము వైపు- ౧౮౮౩ వ సంవత్సరమున గురుదత్తుని జీవితంలో ఒడిదుడుకుల సంవత్సరం. గురుదత్తుని పాఠశాల జీవితంలోనే ఈశ్వరభక్తి మొలక అతనిలో పూర్తిగా నాటుకొనియుండెను. కాని ఇపుడు అతనిలో ఈశ్వరుని గురించి కొంత సందేహం కలిగెను. దాని ప్రభావం అతని మిత్రులపైన పడకుండా ఉండదు గదా! గురుదత్త తన భావాలను ఎప్పుడును దాచిపెట్టలేదు. అతడు మనోవాక్కర్మలలో నొక్కటిగా నుండెడివాడు. మాటలు, చేతలు విపరీతముగా నుండు వ్యక్తులనిన గురుదత్తకు అసహ్యము. గురుదత్త తన నాస్తికభావాలను ప్రకటించేవాడు. దాచుకొనే వాడుకాదు. అతని మిత్రులెందరో అతని ననుసరింపదలచిరి. కాని త్వరలోనే వారి భావాలు మారిపోయెను. కారణం! గురుదత్తుడు కొద్దికాలమే నాస్తిక భావాలు కలిగి యుండెను. ఆ స్వల్పకాలంలోను అతడు గుప్త నాస్తికుడుగా ఉండదలచ లేదు. ఈ కొద్దికాలపు నాస్తికత స్వయంగా గురుదత్తునకు గాని, అతని మిత్రులకు గాని ఎటువంటి నష్టాన్ని కలిగించలేదు. పైగా ఈ కొద్ది కాలపు నాస్తికత వారందరి జీవితాలను ఉజ్జ్వలముగను, ఈశ్వర ప్రేమతో నిండినట్లుగను జేసివైచెను.

౧౮౮౩ జనవరి నెలలో గురుదత్తుడు ధర్మముగూర్చి ఉపన్యసించెను. అందు ధర్మం పేర జనుల మూఢవ్యవహారములను చక్కగా ప్రదర్శించెను. ధర్మం యొక్క వాస్తవిక స్వరూపమును తెలిపెను. అదే సంవత్సరం మార్చి నెలలో ఆర్యసమాజం గురించి తెలుపుటకు '' విజ్ఞాన శ్రేణి'' ని ఆరంభించెను. విజ్ఞాన మహామహోపాధ్యాయ శ్రీ ' ఓమెన్' దానికి సంరక్షకుడు ఇట్లు ఆర్యసమాజం ఒక తార్కిక వైజ్ఞానిక (విజ్ఞానానుకూల) సంస్థయని నిరూపించుటకు అతడు చేతనైనంతగా ప్రయత్నించెను.

ఆస్తికత్వపు స్థిర ముద్ర :- ౧౮౮౩వ సంవత్సరం గురుదత్తు గూడ ఎంతో క్రియాశీలుడుగ ఉండెను. ఆర్య సమాజ సంస్థాపకుడైన మహర్షి దయానందుడు అజ్మీరునందు అనారోగ్యముగా నున్నాడని అకస్మాత్తుగ సమాచారం అందెను. ఇతర పెద్ద సమాజాలవలెనే లాహోర్ ఆర్యసమాజం వైపున లాలా జీవన్‌దాస్‌తో పం॥ గురుదత్త ప్రతినిధి రూపమున స్వామీజీ సేవలకొరకు అజ్మీరు పంపబడెను. అపుడు గురుదత్త ౧౯ సం॥ల నవయువకుడు. ఐనను

అతడు జ్ఞానం, అనుభవం, ప్రభావంలో అందరికన్న మిన్నయైయుండెను. అందరి నాయకునిగా పరిగణింపబడు చుండెను. ఆర్య సమాజ సభ్యులందరికి అతనిపై గొప్ప విశ్వాస ముండెను. గురుదత్త (Young Philosopher) యువ తత్త్వవేత్త, ప్రతిభావంతుడైన నవయువకుడు అని మిక్కిలి గౌరవింపబడెడివాడు.

గురుదత్త అజ్మీరు చేరుకొనెను. ఋషిచికిత్సలో పాల్గొనెను. ఋషికి ఉపశమనం లేకుండెను. శరీరమంతట పుండ్లు వ్యాపించెను. ఆయన బలహీనుడై యుండెను. ప్రతి శ్వాస ఎంతో బాధతో కూడి యుండెను. ఇంతటి కష్ట పరిస్థితిలోను ఋషి నోటి నుండి నిట్టూర్పు గూడా వెళ్లకపోవుట ఎంత ఆశ్చర్యకరమైన విషయము! అందుకు గురుదత్త గూడా చకితుడయ్యెను. మిక్కిలి ఏకాగ్రతతో కుతూహలముతో ఋషి వైపు చూచుచుండెను. అద్భుత మహాపురుషుడు ఇంతటి బాధలో గూడ అంత శాంతంగా ఎట్లుండగల్గుచున్నాడో ఆశ్చర్యంగా ఉండెను. అర్థం గాకుండెను. ఇంత భయంకర బాధ! ఐనా శాంతం!! నిట్టూర్పైనను విడుచుటలేదు. బ్రహ్మచర్యం, యోగం, ఈశ్వరవిశ్వాసం యొక్క క్రియాత్మక సందేశవాహకత్వం గురుదత్తపై తన ప్రభావం చూపెను. గురుదత్తలో ఒక తీవ్రపరివర్తనం కలిగెను. ఋషి ప్రాణాయామం చేసి తన ప్రాణాలను త్యజించే సమయం. సరిగా అప్పుడే ఋషి నోట చివరిసారిగా ''హే దయామయా! హే సర్వశక్తిమాన్ ఈశ్వర్! తేరీ యహీ ఇచ్ఛాహై! తేరీ ఇచ్ఛా పూర్ణహో తూనే అచ్ఛీ లీలాకీ'' (ఓ దయామయా! సర్వశక్తివంతుడవగు నో ఈశ్వరా! ఇదియే నీ ఇచ్ఛ! నీ ఇచ్ఛ నెరవేరుగాక! ఆహా! నీవు మంచి లీలయే చూపితివి.) అను మాటలు పెలువడెను. ఆ మాటలు విని గురుదత్త మంత్రముగ్ధుడైపోయెను. అతనిపై అవి గారడి ప్రభావం చూపెను. న్యూటన్, బేకన్‌ల అధ్యయనం వల్ల డార్విన్, స్పెన్సర్‌ల పరిశీలన లభింపని జ్ఞానజ్యోతి ఋషి దయానందుని మృత్యుదర్శనం వల్ల గురుదత్తకు లభించెను.

ఒక ఈశ్వర విశ్వాసి ఎంత శాంతంగా మృత్యువును ఆలింగనం చేసికొనునో, మృత్యువులోను ఈశ్వరుని మహిమను చూడగల్గునో గురుదత్త గమనించెను. ఒక పుచ్చపండును చూచి మరొక పుచ్చపండు రంగు మార్చుననున దొక నానుడి. ఋషి దయానందుని ఈశ్వర విశ్వాస రూప రంగు గురుదత్తపై

చక్కగా హత్తుకొనెను. ఆ రంగు వెలిసిపోనిది. గురుదత్త ఋషి రోగాన్ని దూరం చేయ ప్రయత్నించుటకు పోయెను. కాని ఋషికి చికిత్స చేయగల వారెవ్వరు? దేహాన్ని విడిచి వెళ్లు ఋషి గురుదత్త సంశయరోగ బీజాన్నే నాశనం చేసెను. ఋషి గురుదత్త ఆధ్యాత్మికజీవనాన్ని అమరం చేసి వేసెను. సంశయాత్మక వృత్తి ఆత్మ ఆత్మ పిపాసతో అజ్మీరు వెళ్లిన గురుదత్త అచటినుండి దృఢవిశ్వాసం గల ఆస్తికునిగా తిరిగి వచ్చెను.

ఋషి దయానందుడు వాస్తవంగా ఋషియే. ఆయన తన సర్వశ్రేష్ఠుడైన ఉత్తరాధికారి యగుటకు గురుదత్త అర్హుడని తెలిసికొనెను. మూగ శబ్దాలతో తన కార్యభారాన్ని అతని కప్పగించెను. ప్రాణత్యాగ సమయంలో కేవలం గురుదత్తనే తన వద్ద ఉంచుకొనెను. గురుదత్త గూడా కార్యభారాన్ని మోయుటకు మనసులోనే సంకల్పించుకొనెను. తర్వాత ఆయన ఎట్టి తన్మయత్వంతో ఆర్యసమాజ కార్యక్రమాలలో లీనమయ్యెనో పాఠకులు చూడగలరు.

విద్యార్థి జీవన విశిష్టతలు :- గురుదత్త యొక్క విద్యార్థి జీవితంలోనే ఎన్నియో విశిష్టత లున్నవి. అవి పాఠకులకు స్పష్టంగా కనబడును. ఆ విశిష్టతలను మూడు భాగములుగా విభజించవచ్చును. మొదటిది అ ప్రతిభ ప్రతిజ్ఞతో బాటు అతని అత్యంత వినమ్రత. ఈ గుణాల ప్రభావం ఇతరులపైన అధికంగా ఉండెడిది. ఎవరైనను అతనిని ఆదరించకుండా ఉండలేకపోయెడి వారు. రెండవది. వ్యాయామం పట్ల విశేష అభిరుచి. తెలివిగల బాలురు చాలమంది వ్యాయామానికి విముఖులై యుందురు. కాని గురుదత్త వ్యాయామప్రియుడు. అతని శరీరం బలిష్ఠమైనది. వ్యాయామం వల్ల అతని మానసిక శక్తి గూడ నిరంతరం పెరుగుచుండెను. మానసిక వికాసం ఆగిపోవుటకు కారణమేమియు లేకుండెను. మూడవ గొప్ప విశిష్టత ఆయన చేసిన ఆర్యసమాజ సేవ. కళాశాల జీవితంలోని మూడవ సంవత్సరంలోనే ఆయన ఆర్యసమాజ నాయకులలో లెక్కింపబడుచుండెను. అతని పరామర్శ లేనిదే ఏ పనిగూడా జరిగెడిది కాదు. అది కేవలం అతని విద్యార్థిజీవితం మాత్రమే కాకుండెను. విద్యార్థిజీవితంలోనే ఆయన కార్యక్షేత్రంలో అడుగిడెను. అది అతి విశాలమైపోయెను.

అజ్మీరు నుండి వచ్చి గురుదత్త ఆర్యసాహిత్యమంథనకు పూనుకొనెను. ఆయన ఋషి దయానంద రచిత గ్రంథాలను చదివిన కొలది ఋషిపట్ల ఆయన శ్రద్ధ పెరుగుచునే ఉండెను. ఋషి విరచిత 'సత్యార్థ ప్రకాశ గ్రంథాన్ని ఆయన పదునెనిమిది సార్లు చదివెను. దానిని ఎన్నిసార్లు చదివినను ప్రతిసారి అందు తనకు క్రొత్తవిషయం లభించెడి దని అనుచుండెడివాడు. ఋషి దయానందుని మరణానంతరం౮ నవంబరు ౧౮౮౩ నాడు అతని (ఋషి) స్మారకము నెలకొల్పవలె నను ప్రస్తావన వచ్చెను. ఋషిస్మృతిలో ఒక కళాశాల నెలకొల్పవలెనని నిశ్చయింపబడెను. అప్పుడే గురుదత్త ప్రభావపూర్ణమైన ఉపన్యాస మిచ్చెను. దాని ప్రభావం వల్ల అప్పటి కప్పుడే ఏడువేల రూపాయలు ప్రోగయ్యెను. ఇట్లు గురుదత్త ప్రభావం ప్రతి దినం పెరుగుచునే ఉండెను. ఇట్లాతడు బి. ఏ. పూర్తికాకముందే ఆర్యసమాజా లన్నిటికి ముఖ్యుడుగా గణన కెక్కెను. అతని కీర్తి సమస్త పంజాబులో వ్యాపించెను.

లాలా హంసరాజ్ మరియు లాలా లాజపతిరాయ్, (గురుదత్త) పండిత్‌జీ సహాధ్యాయులు ౧౮౮౫ సం. బీ. ఏ. పరీక్షలో పండిత గురుదత్త విశ్వవిద్యాలయమంతటిలో ప్రథముడుగా నెగ్గెను. లాలా హంసరాజ్ ద్వితీయస్థానంలో నుండెను. పం॥ గురుదత్త సదా ఆర్యసమాజ ప్రచారంలో మునిగి ఉండేవాడు. పాఠ్యపుస్తకాలను ఇంటి వద్ద కూడా చూచెడివాడు కాడు. ఐనను విశ్వవిద్యాలయ మంతటికి ప్రథముడుగా నుండుట ఎంత ఆశ్చర్యకరమైన విషయం! బీ. ఏ. ఉత్తీర్ణుడైన పిదప పం॥ గురుదత్త డీ. ఏ. వీ. కళాశాలకొరకు విరాళాలను ప్రోగుచేయు కార్యంలో నిమగ్నుడాయెను. ఆయన ప్రతి ఆర్యసమాజ ఉత్సవంలో పాల్గొనెడివాడు. డీ. ఏ.వీ. కళాశాల సహాయం కొరకు విజ్ఞప్తి చేసెడివాడు. అతని ఉపన్యాసమునకు శ్రోతలు మిక్కిలి ప్రభావితు లగుచుండిరి. రూపాయల వర్షం కురిపించుచుండిరి. స్త్రీలు, బాలికలు తమ ఆభరణాలను తీసి దాన మిచ్చెడివారు. గురుదత్త ఉపన్యాసంలో అంతటి ఆకర్షణ ఉండెడిది. ఆర్యసమాజ కార్యాలలో గురుదత్త మునిగి తేలుచుండెను. ఆయన కార్యభారం ఎంతగానో పెరిగిపోయెను. ఆయన లాలా సాయీదాస్ కుడి భుజంగా భావింపబడుచుండెను. త్వరలోనే డీ. ఏ. వీ. కళాశాల పాఠ్యక్రమం సిద్ధం

చేయబడెను. ఆర్యప్రతినిధి సభ నిర్మింపబడెను. ఈ కార్యక్రమా లన్నిట గురుదత్త భాగమే అధికముగా ఉండెను.

౧౮౮౬లో పం॥ గురుదత్త ఎం. ఏ. పరీక్ష ఇచ్చెను. అందులో పూర్వం వలెనే మళ్లీ ప్రథమ స్థానాన్ని పొందెను. ఎం. ఏ. లో ఆయన విషయం పదార్థవిజ్ఞానం(Physics) ఆయన ఎం. ఏ. పరీక్షలో అంతవరకు ఎవ్వరును పొందలేనన్ని గుణములు సంపాదించి కీర్తిని స్థాపించెను. నేటికిని గూడ అన్ని గుణములు సంపాదించిన వారెవ్వరును లేరు. ఆశ్చర్యకర విషయమేమన ఎం. ఏ. అధ్యయన కాలంలో గూడ ఆయన ఆర్యసమాజాల ఉత్సవాలలో పాల్గొనుచుండెను. ఆయనతో కలిసి ఒకే ఇంట్లో నివసించే పలువురు విద్యార్థులు గురుదత్త పరీక్ష కొరకు సిద్ధపడుట నెన్నడును చూడనే లేదని, ఆయన అధిక సమయం ధార్మిక విషయాలపై వాదవివాదంలోనే గడిపెడివాడని తెలిపిరి. ఎవరికైనను వైదిక సిద్ధాంత విషయంలో ఎటువంటి సంశయం కలిగినను వెంటనే పం॥ గురుదత్తను చేరి సమాధానం పొందెడివారు. గురుదత్త ఎం. ఏ. ఉత్తీర్ణుడగుట విశ్వవిద్యాలయ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టము. ఏలన ఇంతటి ఘనవిజయాన్ని ఇంతకు పూర్వం ఎవ్వరును సాధించలేదు. ఆయన విద్యాభ్యాసకీర్తి సర్వత్ర వ్యాపించెను.

జీవిత నిర్వహణ సమస్య :- ఎం. ఏ ఉత్తీర్ణుడు కాగానే గురుదత్త జీవిత నిర్వహణ సమస్య ఎదురయ్యెను. తండ్రి సేవానివృత్తుడై వృద్ధుడయ్యెను. ఆతని సేవానివృత్తి వేతనం అతిస్వల్పం. ఆదాయపు మరొక మార్గమేదియు లేకుండెను. కుటుంబనిర్వహణకు ధనం అవసరం. గురుదత్త ఇష్టపడినచో మంచి ప్రభుత్వోద్యోగం దొరికెడిదే, ఏలన ఆయన వంటి ప్రతిభగలవారు, యోగ్యవ్యక్తులు ఆనాడు కఠినంగానే దొరికెడివారు. కాని గురుదత్త వంటి స్వచ్ఛమైన ఆర్యునికి అతని స్వాతంత్ర్యమునకు ఆటంకం కలిగించని ఆత్మగౌరవపూర్ణమైన (వృత్తి) ఉద్యోగం అవసరం. ఆయన ధనంకొరకు తన స్వేచ్ఛను వదలుకోదలచలేదు. ఆయన న్యాయవాది. చికిత్సకుడు, ఆర్జీకుడు (ఇంజనీర్) న్యాయాధీశుడు, శాసకుడు, వ్యాపారి కాదలచెను. కాని ఇందు ఏ

ఒక్కటి గూడ అతని స్వాభిమానానికి అనుకూలముగా కనబడలేదు. విద్యార్థికాలంనుండియే జీవననిర్వహణకు తగిన పనిని ఎన్నుకొనుట ఆయనకు సమస్యగా ఉండెను. ఎంతో ఆలోచించిన మీదట పం॥ గురుదత్త అధ్యాపక వృత్తిని చేపట్ట నిశ్చయించు కొనెను. ఆయన ౧౮౮౬ లో ప్రభుత్వ కళాశాల, లాహోరులో విజ్ఞాన సహాయ ప్రొఫెసర్‌గా నియుక్తుడయ్యెను. ఆయన తన పనిని అత్యంత యోగ్యతతో చక్కగా నిర్వర్తించెను. ఆ దినాలలోనే ఆయన ఆయుర్వేద అధ్యయనం పట్ల శ్రద్ధ కనబరచెను. స్వల్పకాలంలోనే ఆయన ఆయుర్వేదంలో మంచి యోగ్యతను సంపాదించెను. ఆయనకు ఆయుర్వేద చికిత్సలో ఎంతో విశ్వాసం ఉండెను. ఆయన ఆంగ్ల ఔషధాలకన్న భారతీయ ఔషధాలు లాభకరాలని నమ్మెడివాడు.

విజ్ఞాన ఆచార్య (ప్రొఫెసర్) పని గూడ గురుదత్తుకు సంతుష్టిగా లేకుండెను. ౧౬ ఫిబ్రవరి ౧౮౮౭ సెనేట్ ఆయనను అతిరిక్త సహాయక కమీషనర్ పదవిలో (నియుక్తి)కై ప్రతిపాదించదలచి ఆయనను సమ్మతించుడని కోరెను. ఈ పరీక్షలో కేవలం ఉన్నత వంశానికి చెందినట్టి రాజ్యకర్మచారుల, ప్రభుత్వోద్యోగుల పిల్లలు లేదా పంజాబు విశ్వవిద్యాలయం ద్వారా సమర్థింపబడిన అభ్యర్థులే పాల్గొనగల్గుచుండిరి. పంజాబు విశ్వవిద్యాలయం గురుదత్త విశిష్ట యోగ్యతను దృష్టియందుంచుకొని ఆయన పేరును ప్రతిపాదించెను.

ఈ పదవి కొరకు ఒక ఉన్నత రాజ్యాధికారి పం॥ గురుదత్తను ౧౫ జూన్ ౧౮౮౭ నాడు ఆహ్వానించెను. ఆ ఆహ్వానాన్ననుసరించి ఆయన వెళ్లెను. ౧౨ అక్టోబర్ ౧౮౮౭ లో లాహోరు జిల్లాధీశుడు ఆ పరీక్ష పత్రాన్ని నింపుటకు కార్యాలయానికి రమ్మనెను. ఆయన వెళ్లెను. కాని ఆయన జిల్లాధీశుని ప్రస్తావనను అంగీకరించలేదు.

గురుదత్త బోధనా విధానం ఎంతో ఉత్తమమైనది. ౧౮౮౭-౮౮వ సంవత్సరంలో ఆయన చదివించిన విద్యార్థులందరు కూడ ఉత్తీర్ణులైరి. అందులో ఒక మందబుద్ధి గల విద్యార్థి కూడా ఉండెను. అతడు ఉత్తీర్ణుడగు

నని ఎవరును ఎంత మాత్రమును తలచలేదు. అతడు కూడా ఉత్తీర్ణు డయ్యెను. ఈ ఫలితములు గురుదత్త ఖ్యాతిని ఇనుమడింపజేసెను.

వివాహము-సంతానము :- భారతదేశం పైన మహ్మదీయుల ఆక్రమణ కాలం నుండి హిందువులలో బాల్యవివాహ ఆచారం ప్రారంభమైనది. దాని ననుసరించియే గురుదత్త వివాహం బాల్యంలోనే పాఠశాలలో చదువు చున్నపుడే జరిగెను. ఆయన ధర్మపత్ని సేవీబాయి. ఆమె అందగత్తె. ఎత్తైన, ఆరోగ్యవంతమైన శరీరం, మధుర స్వభావం గలది. ఆమె తల్లిదండ్రుల మొదటి సంతానం. ఆమెకు ముగ్గురు చెల్లెండ్రు, లఛమన్‌దాస్ అనునొక తమ్ము డుండెను. ఆమె తండ్రి మెహతా మూల్‌చంద్ గోడావారా థానేదారుగా పనిచేయుచుండెను. ఆయన ముల్తాన్‌లో బోహర్‌దర్వాజాలో గల నౌగజీ కబర్‌వాలీ గలీలో నివసించుచుండెను. ఆమె తల్లి బధయి వంశానికి చెందినది.

సేవీబాయి గురుదత్తలకు ఒక పుత్రుడు కలిగెను. ఆతనికి తండ్రి సదానందుడని పేరిడెను. సదానంద పెద్దవాడై ముల్తాన్ ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పదవిని పొందెను.

వేద ప్రేమ - యోగ ప్రేమ :- పరిస్థితుల ప్రభావం వల్ల మనుష్యుని నిర్మాణమగు నందురు. ఇది నిజమే. పరిస్థితులు మనుష్యునిలో ఒక ప్రవృత్తిని, ప్రభావాన్ని కలిగించును. సాహసవంతులు ఆ భావనలో ఎంతయో సాధించి తీరుదురు. భావం (సంకల్పం) కలుగుటయే తడవు. ఇంకేమున్నది! గురుదత్తకును సంకల్పానికిని మొదటినుండి చివరి వరకు ఎడతెగని సంబంధ ముండియేయుండెను. బాల్యమునుండియే ప్రాణాయామ ప్రవృత్తి వెన్నాడుచుండెను. ఎనిమిదవ తరగతినుండియే యోగప్రవృత్తి తీవ్రముగా నుండెను. అజ్మీరులోని ఋషియొక్క మృత్యుఘట్టం అతనిలో యోగం నేర్చుకునే కోరికను ఇనుమ్మడింపజేసెను. లాహోరు చేరి ఆయన యోగదర్శనం చదువనారంభించెను. తన పనిని, నియమపూర్వకంగా నెరవేర్చుటకు ఆయన దినచర్య (దైనందిని) వ్రాయనారంభించెను.

డేవిస్ మహాశయుని పట్ల భక్తి :– అమెరికా ప్రసిద్ధ రచయిత, యోగి ఆండ్రూ జాక్సన్ డేవిస్ రచనలను పం॥ గురుదత్త ఎంతో శ్రద్ధతో, ప్రీతితో చదువుచుండెడివాడు. ఆయన డేవిస్ మహాశయుడొక గొప్ప యోగి యని యనుచుండెడివాడు. డేవిస్ ఏకాంతంలో ఏదో చెప్పుచుండెడి వాడు. ఆతని నోటి నుండి వెడలిన శబ్దాలను ఒక వ్యక్తి వ్రాస్తూ ఉండెడివాడు. ఆ భావాలే తర్వాత పుస్తకరూపంలో వెలువరింపబడుచుండెను.

ఎం. ఏ. ఉత్తీర్ణుడైన తర్వాత గురుదత్త ప్రభుత్వ కళాశాలలో విజ్ఞాన ప్రొఫెసర్గా నియమింపబడెను. ఈ పదవి లభించిన మొదటి భారతీయు డాయనయే. అంతకు పూర్వం అచటి ప్రొఫెసర్లందరు ఆంగ్లేయులే. కళాశాలలో ఆతని యోగ్యత, బోధనాశైలి ప్రసిద్ధమై పోయినది. ఆయన రెండు మూడేండ్లవరకే ఆ పదవిలో పని చేసెను. ఆ పదవిలో ఉండి తా ననుకున్నట్లు సమాజ ప్రచారం చేయలేకపోవుచుండెను. యోగాభ్యాసంలో గూడా విఘ్నం కలుగుచుండెను. కావున ఆయన ఆ పదవికి త్యాగపత్ర మొసగెను. కళాశాలలో ఆయన కేవలము రెండు గంటలు మాత్రమే చదివించవలసి యుండెడిది. కాని ఆయన తన ప్రాతఃకాల సమయాన్ని యోగాభ్యాసం కొరకే వినియోగింపదలచెను. కళాశాల అధికారులు, ఆయన హితం గోరు ఇతరులు ఆయనపైన ఎంతయో ఒత్తిడి తెచ్చినను వినలేదు. పట్టుదలను విడువలేదు.

యోగం తర్వాత గురుదత్తకు వేదార్థాన్ని తెలిసికొను సంకల్పం కలిగెను. స్వామి దయానందుని వేదభాష్యం చదువదొడగెను. వేదభాష్యాన్ని సరిగా గ్రహించుటకు అష్టాధ్యాయీ, నిరుక్తం చదువ నారంభించెను. ఆయన అష్టాధ్యాయిని వేదం ద్వారా అర్థం చేసికొనెడివాడు. ఇది ఆతని సహచరులపై ఎంతయో ప్రభావం చూపెను. మాస్టర్ ఆత్మారాం, పండిత రాంభజ్దత్, లాలా మున్షీరాం చంకలలో కూడ ఎల్లప్పుడు అష్టాధ్యాయీ కనబడసాగెను.

గురువులకు గురువగుట :– స్వామీ అచ్యుతానంద అద్వైత సంన్యాసి, ఆయన ఋషి దయానందునితో శాస్త్రార్థం చేసియుండెను. అందు ఓడిపోయెను. ఐనను తన ఓటమిని అంగీకరించ కుండెను. ఆయన

వద్ద పం. గురుదత్త ఉపనిషత్తులు చదివెడివాడు. గురుదత్త యుక్తి పూర్వకంగా అద్వైతవాదంగురించి సందేహాలను వ్యక్తం చేసెడివాడు. గురుదత్త ప్రశ్నోత్తరముల ప్రభావం స్వామీ అచ్యుతానందపై ఎంతగానో పడెను. ఆయన అద్వైతమును వదలి ఆర్యసమాజికు డయ్యెను. దెహరాదూన్‌లో స్వామీ మహానంద ఒక పేరు గాంచిన దార్శనికుడు. పం॥ గురుదత్త కొన్ని దినాలు ఆయనవద్ద గూడ చదివెను. ఆయన గూడ పం॥ గురుదత్తచే ప్రభావితుడై ఆర్యసమాజికు డయ్యెను.

సామాన్యంగా గురువు ప్రభావమే శిష్యులపై ఉండును. కాని అద్భుతమైన ఈ శిష్యుడు గురువులనే కాయకల్ప మొనర్చెను. గురుదత్త యోగ్యతకు ఇంతకన్న గొప్ప ప్రమాణము ఏముండును?

నిస్స్వార్థసేవ :- ప్రభుత్వ కళాశాలలో పదవిని త్యజించిన గురుదత్తకు ఆర్యసమాజ సభ్యులు ఆయన జీవన నిర్వహణకొరకు తగిన ఏర్పాట్లు చేయదలచిరి. కాని గురుదత్త అందుకు అంగీకరించలేదు. ఆయన తన ఉపదేశముల (ప్రచారము)ను అమ్ముట కిష్టపడకుండెను. నిస్స్వార్థముగనే ప్రచారము చేయదలచెను.

తండ్రి మరణము :- ౧౮౮౬ లో డీ. ఏ. వీ. కళాశాల కొరకు ప్రచారమునకును, విరాళాలు ప్రోగుచేయుటకును ప్రతినిధి మండలిని పంపుటకు నిశ్చయింపబడెను. వేసవి సెలవులు పండిత గురుదత్త గూడ ప్రతినిధి మండలితో వెళ్ల సిద్ధపడెను. కాని తండ్రి రోగగ్రస్తు డైనందున ప్రతినిధిమండలిలో చేరలేకపోయెను. అందుకు ఆయన మిక్కిలి చింతించెను. మరుసటి సంవత్సరం గూడా ప్రతినిధులను పంపవలె నను నిర్ణయము జరిగెను. అప్పుడు గూడా గురుదత్త తండ్రి మిక్కిలి అనారోగ్యమునకు గురియయ్యెను. గురుదత్త దేశభక్తుడే కాక కళాశాలవంటి జాతీయ సంస్థను మిక్కిలి ప్రేమించేవాడు. కాన తండ్రి ఈ సారి గురుదత్తను ఆపలేదు. గురుదత్త తిరిగి రాగానే తండ్రి మరణవార్త తెలిసెను. వెంటనే తాను చేరువరకు శవదహనం చేయవలదని ముల్తాన్‌కు తంతి ద్వారా తెలిపెను. తాను వెంటనే ముల్తాన్ చేరుకొనెను. అతని కులము వారు మృతక

సంస్కారము పౌరాణికముగా చేయదలచుచుండిరి. గురుదత్త వైదిక పద్ధతిలో దహన సంస్కారము చేయదలచెను. కులంవారు గురుదత్త తల్లిపై ఎంతో ఒత్తిడి తెచ్చిరి. కాని గురుదత్త ఇష్టానుసారమే వైదిక పద్ధతిలో సమస్త క్రియలు జరుపబడెను.

తండ్రి మరణంవలన గురుదత్తకు మిక్కిలి దుఃఖము కలిగెను. ఈ దుఃఖమునుండి తేరుకొనక పూర్వమే సమాజ వార్షిక ఉత్సవాలలో డీ. ఏ.వీ. కళాశాల సహాయంకొరకు విజ్ఞప్తి చేయుటకు గురుదత్త ఆహ్వానించబడెను. ఈ సంస్థ యనిన గురుదత్తకు మిక్కిలి ప్రేమ. కావున సమస్త కార్యములను వదలి పిలుపు ననుసరించి వెళ్లెను. ఆయన ఉపన్యాస వర్షమునకు ధనవర్షము కురియసాగెను. ఆయన ఉపన్యాసవములలో ఆధ్యాత్మిక జ్ఞానవము పొంగులువారెడిది. జనులు గద్గదులై కన్నీటిధారలను ప్రవహింపజేసెడివారు. ఆయన ఉపన్యాసమువలన జనులకు అపరిమితానందము కలిగెడి దనుట కదే ప్రమాణము.

కాలము గడచిన కొలది గురుదత్త కార్యభారము పెరుగుచునే ఉండెను. ఆతని ఇంటికి సందేహనివృత్తికై జనులు ఎల్లప్పుడు అధికసంఖ్యలో ఎల్లప్పుడు చేరుచునే ఉండెడివారు. ఈ క్రమము ఎల్లప్పుడు కొనసాగుచుండెడిది. ఇద్దరు సంన్యాసులు గురుదత్త వెంట ఎల్లప్పుడు ఉండెడువారు. ధార్మిక విషయముల చర్చ సదా జరుగుచునే ఉండెడిది. గురుదత్త ఇల్లు ఒక సంన్యాసాశ్రమమే అయిపోయెను. గురుదత్త ధన్యుడు. ఆయన ఇన్ని పనులు నెరవేర్చుచున్న ఆయన ఉత్సాహం ప్రతిదినం పెరుగుచునే ఉండెను. ఆయన ఎన్నడును అయిష్టత కనబరచలేదు.

విదేశీ పండితుల నోరు మూయించుట :- ఐరోపా, అమెరికా దేశాల విద్వాంసు లెందరో సంస్కృతము, వేదము, యోగము పట్ల ఆసక్తి కలిగి యుండిరి. నేడును కలిగియున్నారు. ఐరోపావాసులను వారి స్వాధ్యాయ ప్రేమ కారణంగా ప్రశంసించకుండా ఉండలేకున్నాము. కాని ఆ విదేశీయులు అధికాంశంలో వైదిక సాహిత్యాన్ని సరిగా గ్రహించలేక పోయినారు.

అందువలన ఈ అపార జ్ఞానభండారంతో సయ్యాటలాడుటకు యత్నించినారు. వారు గూఢమైన సాహిత్యరహస్యాలను సామాన్యజనులకు అందజేయ యత్నించినారు. కాని స్వప్రయోజనాన్ని సాధించుటకు మిక్కిలి చాతుర్యమును చూపినారు. వారు ఆ సాహిత్యం పట్ల జనులకు ఏవగింపు కలిగింప యత్నించినారు. వారు ఈ పద్ధతిని అవలంబించుటకు ఎన్నియో రహస్యకారణా లున్నవి. మేము వాటిని ఇచట పేర్కొనుట ఉచితమనుకొనుట లేదు. మోనియర్ విలియమ్స్ అను పాశ్చాత్య విద్వాంసుడు '' భారతీయ ప్రజ్ఞ '' (ఇండియన్ విజ్డమ్) అను పుస్తకాన్ని రచించినాడు. దానిపై గురుదత్త ఎన్నియో ఉపన్యాసముల నిచ్చినాడు. దానిలో గల లోపములను వెల్లడించినాడు.

పండిత గురుదత్త ఒక గొప్ప కార్యాన్ని సాధించినాడు. ఆయన స్వరవిద్యను చదివినాడు. వేదమంత్రాల శుద్ధ ఉచ్చారణ విధానాన్ని ప్రకటించినాడు. ఆయన ఇంక నేమియు చేయకున్నను ఈ మహత్తర కార్య మొక్కటే ఆయనకు మహాపురుష పదవిని ప్రసాదించగల్గును.

వేదాల ప్రచారము :– వేదాల సత్యార్థాన్ని తెలిసికోలేక జన్మ జాత బ్రాహ్మణులు వేదాలను కళంకితం చేసియుండిరి. దానివల్ల వేదాల పట్ల పలువురికి శ్రద్ధ తొలగిపోయెను. నవీన విద్య నేర్చినవారు వేదాల విషయంలో వేలాది ప్రశ్నలు కురిపించసాగిరి. వాటన్నింటికి యుక్తి పూర్వకముగా, వైజ్ఞానికముగా వారి పద్ధతిలోనే సమాధానము లిచ్చుటకు ఒక గొప్పవ్యక్తి ఎంతేని అవసరమయ్యెను. ఈ అవసరాన్ని తీర్చుటకు పం॥ గురుదత్త నూటికి నూరు పాళ్లు సమర్థుడై యుండెను. ఆయన వేదాల స్థానము ఆధునిక విజ్ఞానానికన్న ఉన్నతమైనదని ప్రమాణపూర్వకముగా నిరూపించెను. ౧౮౮౮ లో లాహోరు ఆర్యసమాజ ఉత్సవములో ఆయన వ్యాఖ్యానము జరిగెను. ఆయన తన వ్యాఖ్యానములో '' ఆధునిక విజ్ఞానములో ఎన్ని గుణములున్నను అది జీవిత సమస్యలు తీర్చజాలదు. అది సంవత్సరాల వరకు ఎన్నో శస్త్రాల నుపయోగించి శస్త్రకర్మ చేసినను అది జీవిత సమస్యకు సమాధానము కనుగొనజాలదు. జీవిత సమస్యకు సమాధానము వేదములు లేకున్న లభించదు. వేదాలే జీవిత సమస్యకు పరిష్కారం చూపగలవు. అని ౧౯ వ శతాబ్దంలోని అందరికన్న గొప్ప తత్త్వవేత్త యైన

పం॥ గురుదత్త చాటిచెప్పెను. ఆయన పాశ్చాత్య విద్యల ఆధారముననే వేదాల మహత్త్వాన్ని దిగ్దర్శనముగా చూపగలిగెను. స్వామీ దయానందుడు ఆంగ్లభాష ప్రవీణుడు కానందున ఆయనకు పాశ్చాత్య విద్వాంసుల సాంగత్య అవకాశము పూర్ణముగా లేకుండెను. గురుదత్త ఆ కొరతను పూర్తిచేసి వేదాల సర్వశ్రేష్ఠత్వాన్ని పాశ్చాత్యుల మనమున నాటుకొనజేసెను.

ఉపదేశక తరగతి ప్రారంభం :- గురుదత్త డీ. ఏ.వీ. కళాశాల కొరకు అమిత ఉత్సాహంతో రాత్రింబవళ్లు తిరిగి ఆర్థిక సహాయం అందించుటకై విజ్ఞప్తి చేసి సఫలుడయ్యెను. ఆయన డీ. ఏ. వీ. పాఠ్యక్రమములో సంస్కృతానికి ముఖ్యస్థాన మివ్వదలచెను. కాని ఆయన ఈ కోరిక నెరవేరలేదు. ఆర్షగ్రంథాల శిక్షణ లేకున్న గురుదత్త కోరిక తీరుట కఠినముగా నుండెను. కావున ఆయన ఒక ఉపదేశక తరగతిని ప్రారంభించెను. అందు అష్టాధ్యాయి చదివించసాగెను. ఈ తరగతి ఆయన ఇంటి వద్దనే జరుగుచుండెడిది. అందు చిన్న, పెద్ద వయస్సుగల విద్యార్థులు పాల్గొనెడివారు. ఆ తరగతిలోని ఒక విద్యార్థి గురుదత్తకు మిత్రుడే. ఆతడు అతిరిక్త సహాయక కమీషనరు పదవిలో నుండెను. గురుదత్త నడిపే ఈ తరగతిలో చాలామంది విద్యార్థులే చదువుచుండిరి. అందు ఎక్కువ సంఖ్య కార్యాలయాలలో పనిచేసే గుమాస్తాలు. అందువల్ల వారు సమయానికి చేరుకోలేకపోయెడివారు. గురుదత్త తన జీవితకాలంలో నేటి గురుకుల స్వరూపాన్ని చూడలేకపోవుట విచారకరమైన విషయము. ఆయన స్వప్నము పదునొకండేండ్ల తర్వాత కార్యరూపం దాల్చెను. ఆయన ఇంక ౧౧ సంవత్సరాలు జీవించి ఉండినచో అమర హుతాత్మ స్వామీ శ్రద్ధానందునితో కలిసి గంగాతీరమున గల అడవులను సరిచేసెడివాడు. గురుదత్త శిష్యులు గురుదత్తను డీ. ఏ.వీ. కళాశాలకు ప్రధానాచార్యునిగా చేయదలచుచుండిరి. పం॥ గురుదత్తను డీ. ఏ.వీ. కళాశాలలో(ప్రొఫెసర్) ఆచార్యను చేయుటకు గూడ ప్రయత్నించ బడెను. కాని కళాశాలలో వేదాలకు, అష్టాధ్యాయికి స్థాన మెక్కడ ? లేనే లేకుండెను. గురుదత్తకు ఇష్టమైన విషయాలు వేదాలు, అష్టాధ్యాయీలు గదా!

సఫల ఉపన్యాసకుడు :- పండిత గురుదత్త ఒక గొప్ప వక్త, అద్భుత వ్యాఖ్యాత. ఆయన ఆంగ్ల, ఆర్యభాషలలోనే కాదు, సంస్కృతము లోను ధారాప్రవాహంగా ఉపన్యసించ గలిగెడివాడు. పం॥ గురుదత్త జీవించి ఆయన నడిపే ఉపదేశకతరగతి కొనసాగుచుండినచో నేడు నిర్దుష్టమైన అష్టాధ్యాయీ పండితులు అసంఖ్యాకంగా ఉండెడివారు. పం॥ గురుదత్త లాలా రామకృష్ణ ఇంట జన్మించెను. కాని దయానందుని కృపవలన ఆయన పండిత గురుదత్త అయ్యెను. జన్మతః బ్రాహ్మణేతర కులంలో జన్మించి పండితునిగా ప్రసిద్ధి పొందడం కనీసం ఆకాలంలో ఒక విచిత్రమైన నూతన విషయమే.

వానప్రస్థుడగు ఆలోచన :- స్వామీ దయానందుని గ్రంథాలు చదివినందున గురుదత్త భావాలు ఆత్మోన్నతివైపు పురోగమించుచునే ఉండెను. ఆయన గృహస్థసాధువుగా మారియే యుండెను. ఆయన గృహస్థమును వదలి వనములందు నివసింపదలచెను. ఈ భావాలను ఆయన పరివారం ముందుంచగా వారు అందు కంగీకరించకుండిరి. గురుదత్త కుటుంబ భారము తన తలపైన ఉన్నదనే విషయం గమనించెను. తాను లేకున్న కుటుంబం కష్టాలపాలగునని తలంచి వానప్రస్థుడు కావలెనను ఆలోచనను త్యజించెను.

''వైదిక మాగజీన్'' పత్రిక :- ఏప్రిల్ ౧౮౮౯ లో డా॥ ఓమెన్ సెలవు నుండి తిరిగి వచ్చెను. గురుదత్త ప్రొఫెసర్ పదవికి త్యాగపత్ర మిచ్చెను. కొంత కాలం తర్వాత గురుదత్త '' వైదిక మాగజైన్'' అను ఒక పత్రికను ఆరంభించెను. అందు ఎక్కువగా వేదసంబంధ వ్యాసాలే ఉండెడివి. ఈ పనిలో ఆర్యసమాజము ఆయనకు ఎంతో సహాయపడెను. ఈ పత్రిక ఖ్యాతి భారతదేశంలోనే కాక విదేశాలలోను వ్యాపించెను. భారతదేశం వెలుపల విదేశీ పత్రికలెన్నింటనో ఈ పత్రిక ఎంతయో ప్రశంసింపబడెను. '' వైదిక మ్యాగజైన్'' నడిపే కాలములో పం॥ గురుదత్త మిక్కిలి వ్యస్తుడుగా నుండెడి వాడు. ఆయన సమాచార పత్రాలను గూడ చదువలేకుండెను. అంతకు పూర్వం పండిత్‌జీ వ్యాసాలు '' ఆర్యపత్రిక'' లో ప్రకటింపబడుచుండెను. '' వైదిక మ్యాగజైన్'' నడిపే కాలంలో గూడ ఆయనకు రెండు పనులలో ఎంతో సమయం ఇవ్వవలసి వచ్చెడిది. ౧. ఉత్సవాలకు పోవుచునే ఉండెడివాడు. ౨. ఇంట్లో ఉన్నప్పుడు

గూడా శంకాసమాధానంకొరకు జనులకు సమయం ఇవ్వవలసి వచ్చెడిది. 'వైదిక మ్యాగజైన్' ఒక సాధారణ మాసపత్రిక కాదు. అసాధారణమైనది. పంజాబు ప్రాంతమందలి పండిత వర్గము దానిని ధర్మపుస్తకము వలె చదువు చుండెడివారు. వెలువడగానే దానిని పొంది మిక్కిలి ప్రసన్ను లయ్యెడివారు. సామాన్యంగా గురుదత్త పుస్తకాలన్నియు క్రమముగా ఇవే పత్రికలో ప్రకటింపబడుచుండెను. ఏమైనను అది నేటి పత్రికలవంటి సామాన్య మాసపత్రిక మాత్రము కాకుండెను. అది పం॥ గురుదత్తవంటి విచిత్ర విభూతి నెల దినముల పరిశ్రమ ఫలితముగా వెలువడుచుండే ఒక అద్భుత పత్రిక.

పం॥ గురుదత్త ఆత్మనిరూపణము గూర్చియు కొన్ని కరపత్రములు వెలువరించి యుండెను. ఆయన పనిచేసిన కాలము చాలా తక్కువ. ఈ కొద్ది సంవత్సరముల కాలములో ఆయన చేసిన కార్యములను గమనించినచో ఆయన ఇంక కొన్ని సంవత్సరాలు బ్రతికియుండిన ప్రపంచ ప్రాచ్య విద్యాపండితులలో గణన కెక్కెడివాడు. ఆయన మ్యాక్స్‌ముల్లర్ గ్రంథముల నన్నిటిని, న్యాయ, మీమాంసా, వైశేషి కాది దర్శనములను, మనుస్మృతి మరియు స్వామీ దయానందుని వేదభాష్యము మున్నగు సమస్త గ్రంథములను చదివియుండెను. ఆయన తన శారీరక, మానసిక శక్తుల సామర్థ్యమునకు మించిన పనిని చేసెను. శరీరమును నిర్లక్ష్యము చేసెను. అందువలననే ఆయన ఆరోగ్యము చెడిపోయెను. ఎల్లప్పుడు జలుబు వెన్నాడుచుండెను. తరువాత దగ్గు, జ్వరము గూడా పట్టుకొనెను.

రోగకారణములు :– గురుదత్త రోగమునకు ముఖ్యకారణం ఆయన కార్యసాధనలో పూర్తిగా లీనమై దేహము గురించి పూర్తిగా నిర్లక్ష్యము చేయుటయే. "వైదిక మ్యాగజైన్" కొరకు వ్రాయుచు కూర్చున్నపుడు ఎన్నో దినములవరకు ఇంటినుండి బయటకు వెళ్లేవాడు కాదు. ౪౮ గంటల వరకు ఒక నిముషమైనను నిదురించక నిరంతరము చదువుచుండెడివాడు. వస్త్రములను ధరించుట పట్ల గూడ తగినంత శ్రద్ధ చూపకుండెను. చలిలో నూలు వస్త్రములను ధరించియే తిరిగేవాడు. జ్యేష్ఠమాసము తీవ్ర ఎండలో తిరుగుచునే ఉండేవాడు. ఇటువంటి స్థితిలో ఎంతటి బలవంతుడైనను ఎంతవరకు

ఆరోగ్యంగా ఉండగలడు? రోగము గురుదత్తను నలిపివేసెను. అది ఆయన ప్రాణములను తీసికొనియే శాంతించెను.

గురుదత్త అభిమానులు, స్నేహితులు అతని చికిత్సలో ఎంతయో తోడ్పడిరి. అచట ఆరోగ్యం బాగుపడకుండెను. చివరికి అతనిని పర్వతంపైకి తీసుకొనిపోయిన బాగుండు నని తలంచిరి. ఆయనను మఱీకి తరలించిరి. మఱీలో ఆయన భక్తు డొక సర్దార్ ఉండెను. ఆయన గురుదత్త పరిచర్యలో ఎట్టి లోపము రానీయకుండెను. ఐనను శరీరము మిక్కిలి బలహీన మయ్యెను. అంతటి బలహీనతలోను ఆయన పెషావర్ సమాజ ఉత్సవములో పాల్గొనుటకు వెళ్లెను. సుదీర్ఘ ప్రయాణము, ఉజ్జ్వల ఉపన్యాసము, ఉత్సవంలో క్రియాశీల పాత్ర వహించిన పరిణామముగ లాహోరు చేరి మంచము పట్టెను. శరీరము పూర్తిగా నిష్క్రియ మయ్యెను. కొన్ని దినాల తర్వాత కొద్దిగా లాభ మనిపించెను. కాని మళ్లీ అదే డీ. ఏ.వీ. కళాశాల మున్నగు పనులలో మునిగిపోయెను. ఫలితముగా తీవ్ర అనారోగ్యానికి గురియయ్యెను.

లాహోరులో గురుదత్తను ఒక ప్రత్యేక భవనములో ఉంచిరి. పంజాబులో ప్రసిద్ధ వైద్యుడైన పం॥ నారాయణదాస్ చేత ఆయన చికిత్స చేయించిరి. ఇంతకు పూర్వం పం॥ నారాయణదాస్ క్షయరోగుల సెందరినో తన చికిత్స ద్వారా బాగు చేసియుండెను. మొదట కొంత ఉపశమన మనిపించెను. కాని అది ఆరిపోవు దీపపు వెలుగువంటిదే. ఆయనకు ఏమాత్రము ఉపశమనము కలుగలేదు. ఆయన బాగుపడగల డను ఆశ ఎవరికి లేకుండెను. ప్రతి ఆర్యుడును విచారగ్రస్తుడై ఉండెను. యువకుల కళ్లు అశ్రుపూరితము లగుచుండెను. స్వామి దయానందుని అద్వితీయ శిష్యుడు తన గురువువలెనే (అట్టి) బాధామయ స్థితిలోను ప్రసన్నముగా నుండెను.

మరణ పూర్వ దృశ్యము :- ఆనాడు ౧౮ మార్చ్. రాత్రి పన్నెండు గంటల సమయము. గురుదత్తను మరణము సమీపించెను. ఆయన ఇంక కొన్ని గంటల అతిథి మాత్రమే. ఆయన ప్రపంచము నుండి తన సంబంధమును త్రెంచికొనుచుండెను. స్వార్థప్రపంచము విచారములో

మునిగిపోయెను. భక్త రైమల్‌దాస్ మున్నగువారు గురుదత్త సమీపమున కూర్చొని ఉండిరి. ఐదేసి నిముషముల కొకమారు నాడిని వెదకి చూచుచుండిరి. పండిత్ గురుదత్త మరణమునకు కొంత ముందు వేదమంత్రముల నుచ్చరించెను. ఈశోపనిషత్తు వ్యాఖ్య వినెను. మరుసటి ఉదయము ౧౯ మార్చి ౧౮౯౦ నాడు ప్రపంచములోని ఈ గొప్పపండితుడు స్వర్గస్థుడయ్యెను. పాశ్చాత్య ప్రపంచపు కళ్లను వైదిక జ్యోతిచే మిఱుమిట్లు గొల్పజేయు ఈ అద్వితీయ వ్యాఖ్యాత ఈ ప్రపంచమును శాశ్వతముగా వీడిపోయెను. భక్తమండలి, తల్లి, పుత్రుడు అందరు దుఃఖసాగరమున మునిగిపోయిరి. వారందరికి ఈ ప్రపంచము నిస్సారముగ శూన్యముగ కనిపించసాగెను.

'' అయ్యో, గురుదత్త నేటివరకు ఎందుకు జీవించియుండక పోయెను? మనమెంతటి భాగ్యహీనులము? భారతదేశమునకు గర్వకారణుడైన ఈ మహాపురుషుని దర్శనమునకైనను నోచుకొనక పోయితిమి'' అని పాఠకులు ఆలోచించుచుండవచ్చును. కాని భౌతిక శరీరము నశ్వరమైనది. జ్ఞానమూర్తులు, జ్ఞానసముద్రులు నైన ఋషులు, మహర్షులు గూడ ఈ భయంకర మృత్యు వాతబడిరి. నేటి ప్రపంచము వారి బుద్ధిని ప్రశంసించుటలో ఏ మాత్రము అలసిపోదుగదా! ఐనా ఈ కటుసత్యము విజ్ఞులైన పాఠకులకు తెలియనిది కాదు గదా!

ధర్మము- ప్రాణము కన్న ప్రియము :- పం॥ గురుదత్త మిక్కిలి బలహీనుడైనప్పుడు చికిత్సకులు ఆయనను మాంసము తినుమని కోరిరి. కాని ధర్మమును ప్రాణప్రదముగా చూచు పం॥ గురుదత్త దీని నెందు కంగీకరించును? ధర్మోన్నతికొరకే శరీరధారులైనారు ధర్మవిరుద్ధ కార్యముల నెట్లు చేయగల్గుదురు? మాంసము తిన్నచో నేను అమరుడను కాగలనా ? అని ఆయన చికిత్సకులను ప్రశ్నించెను. ''చావు తప్పదని తెలిసి కొద్ది కాల జీవితాని కొరకు హింసను ఎందుకు అవలంబించాలి?'' అనెను.

'' ఆపత్తి కాలే మర్యాదా నాస్తి '' :- ఆపద సమయమున మర్యాద పాలనము జరుగదు అను విషయమును గూడ గురుదత్త ఒప్పుకోలేదు. ఆయన

తన జీవితమును మునుల వలె ధర్మతత్త్వ చింతనములోను మననము లోను గడిపెను. కావున ఆయనను మునివరు డని గూడా అనుచుండిరి.

పం॥ గురుదత్త మరణించిననాడు లాహోరులోని కళాశాల, కచేరీలు మూసివేయబడెను. పఠిత వర్గమునం దెల్లెడల శోకము వ్యాపించెను. పంజాబు విశ్వవిద్యాలయము గూడ తన అనుపమవిద్యార్థిమరణముపై సంతాపమును పాటించెను. పం॥ గురుదత్త ప్రారంభకాల రచనలను దేశవిదేశాలలోని విద్వాంసులందరు గౌరవించియుండిరి. ఉదయము తొమ్మిది గంటల వరకే ఐదారువందల జనసమూహము పం॥ గురుదత్త ఇంటి ముందు చేరుకొనిరి. ఆనాడు ఆదివారము కాదు. సెలవుదినము గూడాకాదు. కొందరు ఆ మహాపురుషుని మృత్యువు వలన కలిగిన దుఃఖములో మరచి పోయిరి. మరికొందరు గట్టిగా విలపించుచుండిరి. ఇంకా కొందరు ఆ శ్రేష్ఠపురుషుని గుణగణముల పొగడుచుండిరి. పండిత గురుదత్త తల్లి శోకమును గాంచి కళాశాల మొత్తము విలపించుచుండెను. పది గంటలకు శవయాత్ర ప్రారంభమయ్యెను. దాదాపు వేయిమంది శవయాత్రలో ఉండిరి. దారికి ఇరువైపుల జనులు ఆ మహాపురుషుని చివరి దర్శనమునకై బారులు తీర్చి నిలబడియుండిరి. ఎడనెడ భవనములపై నుండి శవముపై పూల వర్షము కురిపింపబడుచుండెను. ఒంటి గంటకు శవయాత్ర శ్మశాన వాటిక చేరుకొనెను. వేదికను నిర్మించి అంత్యేష్టి సంస్కారము జరిపింపబడెను.

పం॥గురుదత్త రచనలు:– మరణించునప్పటికి పం॥ గురుదత్త కేవలము ౨౬ సంవత్సరముల యువకుడు. ఋషి దయానందుని నిర్యాణము పిదప పం॥ గురుదత్త ఆరేండ్లు మాత్రమే జీవించెను. ఈ ఆరేండ్ల అతి స్వల్పకాలములోనే ఆయన వైదిక సాహిత్యమునకు ఎనలేని సేవ చేసెను. ఆర్యసమాజ ప్రచారము చేసెను. ఈ కార్యములను సాధించుటలో ఆయన తన శరీరమును గూడా లక్ష్యపెట్టలేదు. ఆయన విద్యార్థి దశనుండియే రచనలు ప్రారంభించెను. మొదట ఆయన రచనలు '' ఆర్యపత్రిక'' లలో ప్రకటింపబడెను. తరువాత ది జనరేటర్ ఆఫ్ ఆర్యావర్త మరియు ఆర్య పత్రికలలో ప్రకటింపబడెను. పండిత్‌జీ రచనలు అతి గంభీరములు, పరిశోధనా

పూర్ణములు, దార్శనికములు, శాస్త్రీయములుగ నుండెడివి. '' సత్యం, శివం, సుందరమ్'' అనునది ఆయన ఆదర్శము. ఆయన చిన్న కడవలో సముద్రము నిముడ్చగల గుణము గలవాడు.

౧౮౮౮ లో పం॥ గురుదత్త వ్యాసములు కొన్ని పుస్తకముల రూపమున ప్రకటింపబడెను. జూన్ ౧౮౮౮ లో ''వైదిక సంజ్ఞా విజ్ఞాన్'' అను ప్రసిద్ధ పుస్తకము ప్రచురిత మయ్యెను. మరొక పుస్తకము ''వైదిక విజ్ఞాన్ ఔర్ ఐరోపా విద్వాన్'' అనునది ప్రకటింపబడెను. ఆ తర్వాత '' వాజసనేయోపనిషత్ '' '' ఈశోపనిషత్'' ఆంగ్ల వ్యాఖ్యతో ప్రకటింపబడెను.

౭ సెప్టెంబర్ ౧౮౮౮ నాడు ఈశోపనిషత్తు ననువదించెను. అదికాక '' మాండూక్యోపనిషత్తు'' ఆంగ్లానువాదము టీకా వ్రాసెను. ఋగ్వేదమంత్రముల కొన్నిటిపైన ''వాయుమండలము'' ''జలనిర్మాణము'' ''గృహస్థము'' అను పేర మూడు వ్యాసములను వ్రాసెను. అందు ''జలనిర్మాణము'' పి.హెచ్.డీ. స్థాయికి చెందినది. ౭ ఆగస్టు ౧౮౯౦ నాడు '' ఆంతరిక జీవితపు వాస్తవికతలు'' ప్రచురిత మయ్యెను. '' జీవాత్మాకే ప్రమాణ'' అను విద్వత్ పూర్ణ వ్యాసము ఆగస్టు, సెప్టెంబర్ ౧౮౮౯ లో ప్రచురింపబడెను.

ఇవి గాక '' ధన్‌కా భూత్'', ''అంతః కరణ ఔర్ వేద్'', '' ధార్మిక ఉపదేశ్'' ''స్వామీజీకే వేదభాష్య పర్ కుఛ్ సమాలోచనా, ఓం కా ఉత్తర్'', ''విచార్, ఔర్ భాషాకీ ఉత్పత్తి'', '' మనుష్యకీ అవనతి'' '' మాంసభక్షణ కా ఔచిత్య అథవా అనౌచిత్య'' మోనియర్ విలియమ్స్ రచించిన ఇండియన్ విజ్డమ్'' యొక్క విమర్శ, విడివిడిగను, సంకలన రూపములోను ౧౮౯౭ మరియు ౧౯౧౨ లో లాహోర్ నుండి ప్రకటితమైనవి. పం॥ గురుదత్త సాహిత్యము ఇప్పుడు లభించినంత వరకు మొత్తము ఆంగ్లములోనే కలదు. అందు ఈశోపనిషత్, మాండూక్యోపనిషత్ ల హిందీ అనువాదము మాస్టర్ ఆత్మారాం అమృతసరీ ద్వారా చేయబడినది. మిగతా వాటన్నిటి అనువాదము పం॥ భగవద్దత్తజీ బీ. ఏ. మరియు సంతరాం, బీ. ఏ. చేసిరి. వాటిని ''గురుదత్త

లేఖావళి అనుపేర రాజ్‌పాల్ అండ్ సన్స్ ద్వారా ప్రకటింపజేసెను. గోవిందరాం హాసానంద్ కూడ " గురుదత్త లేఖావళి"ని "వేదప్రకాశ్" విశేష సంచికగా వెలువరించిరి.

ఇవిగాక పం॥గురుదత్త సంధ్యామంత్రాలకు ఆంగ్లానువాదము చేసి వ్యాఖ్యానమును వ్రాసెను. మరొక పుస్తకము లాహోరులో . జరుగుచుండెడి సభల, సమాజముల మనోహర వృత్తాంతమును తెలుపుదానిని వ్రాసెను. మనుస్మృతి పైన గూడ కొన్ని టిప్పణుల వ్రాసెను. జీవనదాస్ యొక్క కోరికపైన పం॥గురుదత్త ఉర్దూలో " మసలయే ఇల్హామ్" అను ప్రచారపుస్తకము నొకదానిని వ్రాసెను. ఇవన్నియు పండిత్‌జీ మరణించినందున ప్రకటితములు కాలేదు. ఆ తరువాత అవి ఏమై పోయినవో తెలియదు. నేడవి ఎక్కడను లభింపవు. ఆయన కొన్ని ఉపనిషత్తులను అనువదించెను. వాటిని " పార్లమెంట్ ఆఫ్ రిలిజియన్స్" (మతముల ధార్మిక సమ్మేళనము) సందర్భమున అమెరికా పంపించి యుండెను. ఒక అమెరికావాసి దానిని ప్రచురించినాడు. పం॥గురుదత్తజీ " వేద్‌కా శబ్దకోశ్" వ్రాసెను. అది ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయములో చదివించబడుచున్నది. పం॥ గురుదత్త అంతర్జాతీయ కీర్తిని పొందుచుండె ననుట కిది ప్రబల ప్రమాణము. కాని నిష్ఠుర మృత్యువు ఆయనను అల్పవయస్సులోనే కబళించివేసెను.

నేటి ఎం. ఏ.; బీ. ఏ. లు సంస్కృతమును మృతభాష అనే దుస్సాహసము చేయుచున్నారు. సంస్కృతమును చదువుటకు ప్రయత్నించువా రెందరు? పంజాబులో గురుదత్త, చమూపతి ఇద్దరు సంస్కృతముపై మిక్కిలి ప్రేమ కలిగి యుండిరి. ఈ ప్రేమ వర్ణనాతీతము. చమూపతికి బీ. ఏ. వరకు హిందీ అక్షరముగూడ తెలియకుండెను. ఆయన ఎం. ఏ. సంస్కృతములో ఉత్తీర్ణుడయ్యెను. ఒకప్పుడు గురుదత్త "నేను మొత్తము ఆంగ్లమును, పాశ్చాత్యవిద్యలను మరచిపోగలిగిన, కేవలము సంస్కృతమునే జ్ఞాపక ముంచుకోగలిగిన ఎంత బాగుండెడిది? అని వాపోయెను.

డీ. ఏ.వీ. కళాశాల స్థాపనలో పం॥ గురుదత్త ప్రయత్నమే గొప్పది. ఆ కళాశాలలో ప్రముఖ స్థానం సంస్కృతమునకే ఉండవలె నని ఆయన తీవ్ర


కోరిక. కాని ఆ కోరిక నెరవేరలేదు. గురుదత్త నిరాశచెంది ఉపదేశక తరగతులను నడిపెను. ఆయన ఒక సంస్కృతగ్రంథాలయమును స్థాపించదలచెను. అందుకై ఆయన కళాశాల ప్రబంధక సమితిని ఐదు వేల రూపాయ లడిగెను. కాని అది ఇవ్వలేదు. కళాశాల పాఠ్యక్రమము పం॥గురుదత్తకు అనుకూలముగ లేకుండెను. ఐనను ఆయన కళాశాలతో విరోధించలేదు. ఆయన ఉదారతకు ఇంతకన్న మించిన ప్రమాణ మేమి కావలెను? వైదిక సాహిత్య పరిశోధనకు, ప్రచార కార్యక్రమములకు పం॥ గురుదత్తకు పూర్తి సహకార మందించబడలేదు. ఇదెంతయో బాధాకరమైనవిషయము. విదేశీయులు సంస్కృతసాహిత్య పరిశీలనలో ఎంతయో పరిశ్రమించుచున్నారు. భారతీయుల మైన మననుండి భారతదేశములోనే మన విద్యారాధకునికి (పూజారికి) ఏ మాత్రము సహాయము లభించలేదు. నిజముగా దేశముయొక్క ఈ దీనస్థితిని చూచిన అత్యంత దుఃఖము కలుగుచున్నది. మనము మన విద్యను గౌరవించుట ఎన్నడు నేర్చుకొనగలమో! ఆంగ్లజాతి ఎచ్చటికి వెళ్లినను అచ్చట తన ఆంగ్లభాష ప్రచారము చేసెను. తత్ఫలితముననే నేడది ప్రపంచవ్యాప్త భాషయైనది. కాని సమస్త భాషల జననియైన సంస్కృతమునకు నేడు వేలాది సంవత్సరములకు పూర్వమున్న ప్రసిద్ధి గూడ లేదు. దీనికి కారణము కొంత వరకు అన్య ప్రపంచ మార్పు లైనను మనము మన బాధ్యతను గూడ కాదనలేము.

పం॥గురుదత్త కొడుకు ప్రొఫెసర్ సదానంద ఈనాడు ప్రభుత్వ కళాశాల, ముల్తాన్‌లో వైస్ ప్రిన్స్‌పల్‌గా ఉన్నాడు. ఈయన గూడ యోగాభ్యాసము నెడ మక్కువ గలవాడు. ఆర్షగ్రంథాలనిన ఈయనకు మిక్కిలి ప్రేమ. ఈయన యోగ్యుడైన తండ్రికి యోగ్యుడైన పుత్రుడు.

పం॥గురుదత్త జీవితము యువకులకు ప్రేరణదాయకమైన ఆదర్శము. ఆయన జీవితమున ప్రేరణనిచ్చు సామగ్రి పుష్కలముగా నున్నది. భారతదేశపు తెలివి గల యువకులు గురుదత్త అడుగుజాడలలో నడచి ఆయనను అమరుని చేయుదురుగాక!

26. సామాజిక వ్యవహారము.	లోకామల్లరిగారు	2.00
27. వైదిక ధర్మవిజయము	లోకామల్లరిగారు	2.00
28. మనుర్భవ	లోకామల్లరిగారు	7.00
29. ఈశ్వరజ్ఞానము	లోకామల్లరిగారు	4.00
30. ఎవని ఆరాధన ?	లోకామల్లరిగారు	4.00
31. ఫాదరి పలాయనము.	పండిత రుద్రదేవశాస్త్రి	2.00
32. కర్మఫల-చక్రము.	ఆచార్య ఆనంద్ ప్రకాశ్	2.50
33. ఓంకారనిర్ణయము.	ఆచార్య ఆనందప్రకాశ్	1.50
34. కసాయి గృహాలు వందతథ్యములు	ఆచార్య ఆనందప్రకాశ్	14.00
35. మాంసాహారము. 100 తథ్యములు	ఆచార్య ఆనందప్రకాశ్	4.00
36. మనసంస్కృతి మహిళల స్థానము	ఆచార్య ఆనందప్రకాశ్	1.50
37. మీరుగ్రుడ్డు తింటున్నారా	ఆచార్య ఆనందప్రకాశ్	1.50
38. మద్యపానపు దుష్ఫలములు	ఆచార్య ఆనందప్రకాశ్	4.00
39. వాణిజ్యకల్పవిధి	బండారు సత్యానారాయణ	2.00
40. వేదము మానవ కళ్యాణము	పండితరుద్రదేవశాస్త్రి	4.50
41. మర్యాద పురుషోత్తముడు రాముడు	బి. నీరజ	2.00
42. పతంజలి యోగదర్శనము	నిర్మలాయోగభారతి	10.00
43. వైదిక బాలశిక్ష	బి. కుమారస్వామి	10.00
44. సత్యార్థప్రకాశము	గోపదేవశాస్త్రి	40.00
45. ఋగ్వేదాది భాష్యభూమిక	గోపదేవశాస్త్రి	70.00
46. భగవద్గీత	గోపదేవశాస్త్రి	25.00
47. దయానంద సరస్వతి జీవిత చరిత్ర	గోపదేవశాస్త్రి	25.00
48. మునివరుడు పండిత గురుదత్త విద్యార్థి		6.00
49. ఆర్యసమాజ ఉద్దేశ్యములు		2.00
50. బంగారుబాట దయానందుని మాట		2.00
51. వర్ణవ్యవస్థ		2.00
52. పృథివీమాత		2.00

60వ, జన్మదిన శుభాకాంక్షలు



శ్రీ కోటి కె లక్ష్మయ్యగారు జననము 1937 శ్రీ కృష్ణజన్మాష్టమి